



జీజీహెచ్‌లో డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

సమాజంలో వైద్యులకు ఉన్న గౌరవం తగ్గిందీ..

రోగుల పట్ల నిర్లక్ష్యం వీడండి

- జీజీహెచ్‌లో వైద్యశాఖపై మంత్రులు సత్యకుమార్, నారాయణ సమీక్ష

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 9: రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యం వీడాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు ఎంతోమంది నిరుపేద రోగులు వస్తుంటారని, అలాంటి వారికి సేవాభావంతో చికిత్సలు అందించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జనరల్ ఆసుపత్రుల కంటే ఇక్కడ ఎంతో ఉన్నతంగా భవనాలు, వైద్య పరికరాలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నో రకాలుగా వైద్య చికిత్సలు అందించవచ్చని, అయితే కొందరు వైద్యుల తీరు సరిగా లేదన్నారు. గతంలో వైద్యులంటే దేవుడితో సమానంగా చూసేవారిని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇక్కడ వైద్యులు, సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని, త్వరలో ఆ సమస్యను పరిష్కరిస్తామని సత్యకుమార్ పేర్కొన్నారు. పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ జీజీహెచ్‌లో ఉన్న వసతులను దృష్టిలో పెట్టుకుని మెరుగైన వైద్య చికిత్సలు అందివ్వాలని కోరారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్‌లు పలు సమస్యలపై మంత్రికి నివేదికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్ నాథ్, డిప్యూటీ సూపరిం టెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

- **డయాలసిస్ యూనిట్ ప్రారంభం**

నెల్లూరు జీజీహెచ్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ఉదయం డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించారు. రూ. 80 లక్షల ఖర్చుతో బయ్యా సరోనమ్మ పేరు మీద ఆమె కుమారులు బయ్యా రవికుమార్, బయ్యా శ్రీనివాసులు ఆరు పడకల డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. లయన్స్ ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించటం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. పొదలకూరు, వింజమూరులోనూ డయాలసిస్ యూనిట్‌లు కావాలని అడుగుతున్నారని, త్వరలో అక్కడ ప్రారంభిస్తామన్నారు. జీజీహెచ్ సెక్యూరిటీ, శానిటేషన్ విభాగాల్లో అక్రమాలు, అవినీతి జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ వసుంధరాదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, బీజేపీ నేతలు, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.



నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో జరిగిన సామూహిక లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు

జిల్లావ్యాప్తంగా అన్ని అమ్మవారి ఆలయాల్లో శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు, సామూహిక లక్ష కుంకుమార్చనలు జరిగాయి. భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భారీగా ప్రసాద వితరణ, అన్నదానం జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలను అరటి పిలకలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించి, శ్రావణలక్ష్మిని భక్తిశ్రద్ధలతో ఆహ్వానించారు.

జిల్లాలోని ఎస్ఐలకు స్థానచలనం

- పలువురిని బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వుల జారీ

నెల్లూరు,(క్రైం), ఆగస్టు9: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న 22 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ జీ కృష్ణకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే ఆయా కేంద్రాల్లో చేరాలని ఎస్పీ పేర్కొన్నారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుతం	బదిలీఅయిన ప్రాంతం
పీ ఆదిలక్ష్మి	జలదంకి	దుత్తలూరు
ఎం ఉమాశంకర్	దుత్తలూరు	కలిగిరి
ఎం సంతోష్‌రెడ్డి	కలిగిరి	వీఆర్, నెల్లూరు
కే భోజ్యా	బిట్రగుంట	కొండాపురం
బీ మహేంద్ర	కొండాపురం	వీఆర్, నెల్లూరు
కే నాగార్జునరెడ్డి	సంగం	ఇందుకూరుపేట
జీ వీరేంద్రబాబు	ఇందుకూరుపేట	టీపీ గూడూరు
జంపాని కుమార్	టీపీ గూడూరు	దగదర్తి
కే మరిడినాయుడు	దగదర్తి	కందుకూరు టౌన్
ఏ ఆనందభాస్కర్	కందుకూరు టౌన్	వీఆర్, నెల్లూరు
బీ బాల మహేంద్రనాయక్	వలేటివారిపాలెం	కందుకూరు రూరల్
పీ నరేష్	కందుకూరు రూరల్	విడవలూరు
ఎం రాజా	విడవలూరు	వీఆర్, నెల్లూరు
టీ విశ్వనాథ్‌రెడ్డి	మర్రిపాడు	ముత్తుకూరు
ఎం శివశంకరరావు	నార్త్‌ట్రాఫిక్	రాపూరు
జీ మాల్యాద్రి	రాపూరు	వీఆర్, నెల్లూరు
పీ శ్రీనివాసులరెడ్డి	అల్లూరు	ఆత్మకూరు పీఎస్ ఎస్ఐ-1
కే ముత్యాలరావు	ఆత్మకూరు పీఎస్ ఎస్ఐ-1	వీఆర్, నెల్లూరు
ఏ సైదులు	చిన్నబజారు	ఏఎస్‌పేట
కే ప్రసాద్‌రెడ్డి	ఏఎస్‌పేట	వీఆర్, నెల్లూరు
పీ అనూష	సీతారామపురం	సోమశిల
వీ సుబ్బారావు	సోమశిల	వీఆర్, నెల్లూరు

సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు



సౌర విద్యుత్‌పై అవగాహన కల్పించండి

- సీఎండీ సంతోష రావు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 9: సౌర విద్యుత్ తయారీకి ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేస్తున్నందున, దాని ఏర్పాటుపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని విద్యుత్‌శాఖ అధికారులను సీఎండీ సంతోషరావు ఆదేశించారు. విద్యుత్ భవన్‌లో శుక్రవారం ఆయన జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు రూ.78వేల రాయితీని ప్రభుత్వం ఇస్తుందని వివరించారు. ఈ విషయమై విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లను తగ్గించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులంతా విద్యుత్ బిల్లులను డిజిటల్ పేమెంట్‌లో ద్వారా చెల్లించేలా వారిని చైతన్య పరచాలన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, పద్మ, ఎస్ఈ విజయన్ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు తీసుకోవడమే కాదు.. అక్కడికక్కడే సమస్యలు

పరిష్కరిస్తాం !

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 9: ప్రజల నుంచి అర్జీలు తీసుకోవడమే కాదు... అక్కడిక్కడే సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో మంత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కోసమే సీఎం చంద్రబాబునాయుడు ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ వేదికలో దరఖాస్తులు తీసుకోవటమేకాదు వాటికి స్పాట్‌లోనే పరిష్కారం చూపుతున్నామన్నారు. ఈ పరిష్కార వేదికలో ప్రజల నుంచి అధిక సంఖ్యలో అర్జీలు వచ్చాయని చెప్పారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించామన్నారు. కొన్నింటిని కేబినేట్ స్థాయిలో పరిష్కరించాలని మంత్రి చెప్పారు. పోలీసు, రెవెన్యూ టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి అనేక సమస్యలు వచ్చాయని తెలిపారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన వారిని ఎట్టి పరిస్థితిల్లోనూ వదిలేది లేదని నారాయణ హెచ్చరించారు. గత ఐదేళ్లలో వైసీపీ కనిపించని ప్రజా పాలన చేసిందన్నారు. వైపీసీ పాలనలో జరిగిన అక్రమాలపై విచారించి చట్టపరంగా చర్యలు చేపడతామని చెప్పారు. అర్జీలు స్వీకరించిన మంత్రి కొన్నింటిని స్పాట్‌లోనే పరిష్కరించారు. మరికొన్నింటిని విచారించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రితోపాటు కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, నగర కమిషనర్ సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.కాగా వేదిక కార్యక్రమాన్ని తొలుత శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని ప్రకటించినా, సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించడం విశేషం.

ఆలయ భూములకు ఎసరు

- అక్రమంగా పట్టాల పంపిణీ
- నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారుల తీరు
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్

వరికుంటపాడు, ఆగస్టు 9: సామాన్యులకు సెంటు భూమి కేటాయించేందుకు సవాలక్ష నిబంధనలను సాకుగా చూపే రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో ఏకంగా ఆలయ భూములకే ఎసరు పెట్టారు. తమకు అనుకూలమైన వ్యక్తుల పేర్లతో పకడ్బందీగా రికార్డులను రూపొందించి అక్రమంగా పట్టాలు అందచేశారు. దీన్ని బట్టి చూస్తే మండల అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వారి పనితీరుకు వరికుంటపాడు మండలం వేంపాడు గ్రామ రెవెన్యూలో జరిగిన భూబాగోతమే నిదర్శం. వివరాల్లోకి వెళితే..

- **ఫిర్యాదులో వెలుగులోకి...**

ప్రకాశం జిల్లా పామూరులోని మదన వేణుగోపాల స్వామి ఆలయానికి వేంపాడు గ్రామంలో భూములు ఉన్నాయి. పామూరుకు చెందిన కొందరు వ్యక్తులు వాటిపై కన్నేశారు. స్థానికుల సహకారంతో రెవెన్యూ అధికారులను లోబర్చుకొని సర్వే నంబరు 78-1లోని 6.08 ఎకరాల భూమిని 2016లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆలయ కమిటీతో సంబంధం లేకుండా అర్చకులు తమకు అమ్మినట్లుగా బినామీ రికార్డులు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతేకాక దేవదాయశాఖ అధికారులు తమకు ఎన్‌వోసీ ఇచ్చేందుకు సహకరించడం లేదని పట్టాలు పొందిన వ్యక్తులు గతేడాది జూన్ 2న జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అదే ఏడాది సెప్టెంబరు 2న నోటీసులు అందుకున్న ఆలయ కమిటీ సభ్యులు, 1948 నుంచి ఆలయానికి సంబంధించిన పూర్తి రికార్డులను ఉన్నతాధికారులకు అందజేశారు. అనంతరం జేసీ కోర్టులో సాగిన విచారణలో ఆ భూమిలో పట్టాలు పొందిన వ్యక్తుల పేర్లను తొలగించి యథావిధిగా ఆలయ భూమిగా నమోదు చేయాలని అక్టోబరు 26న తీర్పు ఇచ్చారు. దీంతో ఆలయ ఈవోతోపాటు కమిటీ సభ్యులు తమకు న్యాయం జరిగిందని, ఆ భూమిని స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినా మండల రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిచ్చింది. అప్పటి నుంచి ఆలయ కమిటీ సభ్యులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి గతంలో రికార్డులు తారుమారు చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని, ఆక్రమిత భూములను ఆలయ ఆస్తిగా రికార్డులో నమోదు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కోరుతున్నారు.



ఆలయ భూమిలో కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన బోర్డు



పామూరులోని మదన వేణుగోపాలస్వామి ఆలయం

గిరిజనులను అక్షరాస్యులుగా చేస్తాం : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 9: జిల్లాలోని గిరిజనులందరినీ సంపూర్ణ అక్షరాస్యులుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఓ ఆనంద్ చెప్పారు. శుక్రవారం నెల్లూరు గిరిజన భవన్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 20 శాతం మంది గిరిజనులు ఉన్నారన్నారని, వారిలో 10శాతం మంది కూడా అక్షరాస్యతకు నోచుకోలేదన్నారు. వయోజన విద్యశాఖ ద్వారా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి ఆ అందరినీ సంపూర్ణ అక్షరాస్యులుగా మారుస్తామన్నారు. చాలా మంది గిరిజనులకు ఆధార్ కార్డులు లేవన్నారు. ఇందుకు కారణం వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఆధార్ కార్డు పొందాలంటే ఏదో ఒక ఆధారం ఉండాలన్నారు. గిరిజన విద్యార్థులు ఉద్యోగాలు పొందేందుకు వారికి శిక్షణ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ స్రవంతి, పలువురు గిరిజన నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.



గిరిజన యువకుడికి ఆధార్ కార్డు అందచేస్తున్న కలెక్టర్ ఆనంద్



సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యం చేస్తున్న గిరిజన యువతులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అజయ్‌కుమార్

మనుబోలు, ఆగస్టు 9: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొండూరు సత్రం సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా అరవీడు మండలం కుంట గ్రామానికి చెందిన పుష్పాల ఆవులయ్య (52) గ్రామంలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు ఒరుసు కిరణ్ వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో వైద్యం కోసం డ్రైవర్ ఒరుసు వెంకటేష్‌తో కలిసి ఇద్దరూ కారులో చెన్నైకి వెళ్లారు. అక్కడ వైద్యం చేయించుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా కొండూరు సత్రం దాటాక ముందు వెళుతున్న లారీని కారు ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జు అయింది. కారులో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆవులయ్య మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

పశ్చిమ బెంగాల్ యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న పశ్చిమ బెంగాల్ యువకుడు

మనుబోలు, ఆగస్టు 9: పనుల కోసం పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన బాపిహాల్దార్ (19) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా బద్దెవోలు పంచాయతీలోని పల్లిపాళెం గ్రామ సమీపంలో ఉన్న తిన్నెలపూడి మస్తానయ్య రొయ్యల గుంటల వద్ద పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఎవరూ లేని సమయంలో తాను నివాసం ఉంటున్న షెడ్డు పక్కనే ఉన్న వేపచెట్టుకు టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రక్కు ఢీకొని వృద్ధుడి మృతి

నెల్లూరు,(క్రైం), ఆగస్టు 9: నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. చిల్డ్రన్స్‌పార్క్ హైవే జంక్షన్ వద్ద డివైడర్‌పై గురువారం రాత్రి గుర్తుతెలియని వృద్ధుడు (60) నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి సమయంలో విజయవాడ నుంచి చెన్నై వైపు వెళుతున్న ట్రక్కు వాహనం ఒకటి ముందు టైరు పగలడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌పైకి ఎక్కింది. ఆ డివైడర్‌పై నిద్రిస్తున్న వృద్ధుడి పైనుంచి వాహనం వెళ్లడంతో అజ్ఞాత వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి బ్యాచ్‌ని అరెస్టు చేయాలి

● పోలీస్‌స్టేషన్ ఎదుట ఈదూరు గ్రామస్థుల ఆందోళన



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఈదూరు గ్రామస్థులు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 9 : గంజాయి బ్యాచ్‌ని అరెస్టు చేయాలని కోరుతూ ఈదూరు గ్రామస్థులు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఎదుట మీడియా సమావేశంలో గ్రామస్థులు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన ఈదూరు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఎంబేటి శ్రవణ్‌కుమార్ వెళుతుండగా తోటపల్లిగూడూరు హైస్కూల్ పక్కన చర్చి దగ్గర ఆటోను అడ్డగించిన అదే గ్రామానికి చెందిన గంజాయి మత్తులో ఉన్న పండు, ప్రభాస్‌లు ఆటోడ్రైవర్‌పై దాడిచేసి గాయపరిచారని తెలిపారు. గతంలో వీరిపై పలు కేసులు ఉన్నాయని, ఆడపిల్లలను కూడా వేధిస్తున్నారని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటికీ నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గంజాయి బ్యాచ్‌కి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుల అండదండలు ఉన్నాయని, అందువల్లే వారిని అరెస్టు చేయలేదని, జిల్లా ఎస్పీ స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరారు. కాగా, ఎస్ఐ జంపానీకుమార్ వివరణ మేరకు.. ఆటో డ్రైవర్‌పై దాడిచేసిన నిందితులపై కేసు నమోదు చేశామని, ఈ విషయం తెలియక బాధితులు తప్పుగా మాట్లాడినట్లు ఎస్ఐకి తెలిపారని పేర్కొన్నారు.

పలువురు సీఐల బదిలీ

నెల్లూరు,(క్రైం), ఆగస్టు 9 : గుంటూరు రేంజ్ పరిధిలో పదిమంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో జిల్లాలోని పలువురు సీఐలు బదిలీ అయ్యారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాసరావును బాపట్ల జిల్లా మార్టూరు సర్కిల్‌కు బదిలీ చేశారు. సీఐడీలో ఉన్న మద్ది శ్రీనివాసరావును సంతపేట పోలీసు స్టేషన్‌కు, అక్కడ ఉన్న ఏ సుబ్బరాజును రేంజ్ కార్యాలయానికి బదిలీ చేశారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కామరాజుగడ్డ సాంబశివరావును బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌కు, అక్కడ ఉన్న ఎల్ వీరానాయక్‌ను రేంజ్ కార్యాలయానికి బదిలీ చేశారు. వారు వెంటనే విధుల్లో చేరాలని ఐజీ ఆదేశించారు. కాగా, బదిలీల్లో భాగంగా నెల్లూరులోని నవాబుపేట, దర్గామిట్ట పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లుగా షేక్ అన్వర్‌బాషా, ఎం రోశయ్య, వేదాయపాళెం పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా టీవీ సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కేసు

రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ల సీజ్

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం గ్రామంలో ఓ రొయ్యల కర్మాగారం ముందు ఉన్న రోడ్డు పోరంబోకు స్థలంలో ఉన్న మట్టిని అక్రమంగా తవ్వకాలు జరిపిన రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ హనీఫ్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్ల, ఎక్స్‌కవేటర్ల యజమానులపై కేసు నమోదు చేసిట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

ఏటీఎం కార్డు కాజేసి.. నగదు దోచేసి...

ఉదయగిరి రూరల్, ఆగస్టు 9: ఏటీఎం సీక్రెట్ పిన్ చేయిస్తానని నమ్మించి ఓ వ్యక్తి నుంచి ఏటీఎం కార్డును తీసుకొని నగదు దోచేసిన సంఘటన శుక్రవారం ఉదయగిరి పట్టణంలో చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మండలంలోని పుల్లాయపల్లి గ్రామానికి జే.గురునారాయణ తన ఏటీఎం కార్డుకు సీక్రెట్ పిన్‌కోడ్ చేయించుకునేందుకు స్థానిక స్టేట్‌బ్యాంకు ఏటీఎంకు వచ్చాడు. అతనికి తెలియక పోవడంతో అక్కడే ఏటీఎంలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని సీక్రెట్ పిన్‌కోడ్ చేయించాలని అడిగాడు. తాను కూడా సీక్రెట్ పిన్‌కోడ్ చేసుకుంటున్నానని నమ్మబలికాడు. ఈ పిన్‌కోడ్ చేసే క్రమంలో అతని వద్దనున్న ఏటీఎం కార్డును గురునారాయణకు ఇచ్చి గురునారాయణ ఏటీఎం కార్డును తీసుకొన్నాడు. వెంటనే పక్కనే ఉన్న హెచ్‌పీ పెట్రోలబంకులో రూ.4,500లకు కార్డుపై పెట్రోల్ పట్టించుకోవడంతో పాటు దుత్తలూరు ఏటీఎంలో రూ.40 వేలు నగదు డ్రా చేశాడు. తన ఖాతా నుంచి డ్రా అయినట్లు గురునారాయణ సెల్‌ఫోన్‌కు సందేశం రావడంతో మోసపోయాయని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి ఉదయగిరి, దుత్తలూరులోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు.

బాలికపై అత్యాచారం : నిందితుడిపై కేసు

కోవూరు, ఆగస్టు 9: స్థానికంగా ఓ బాలికపై అదే ప్రాంతానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అత్యాచారం చేయడంతో గర్భం దాల్చినట్లు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు వివరాలు.. స్థానికంగా 9వ తరగతి చదువుతున్న బాలికతో ట్రాక్టర్ డ్రైవర్ కత్తి శ్రీనివాసులు చనువుగా ఉండేవాడు. ఈ విషయాన్ని గుర్తించిన బాలిక తల్లి ఆమెను పాఠశాలకు పంపకుండా నిరోధించింది. దీంతో ఇంటి వద్దనే ఉన్న బాలికకు కత్తి శ్రీనివాసులు మాయమాటలు చెప్పి పక్కనున్న పాడుబడిన ఖాళీ ఇంట్లోకి తీసుకువెళ్లి పలుమార్లు అఘాయిత్యం చేశాడు. ఇటీవల బాలిక అనారోగ్యానికి గురికావడంతో తల్లికి అనుమానం వచ్చింది. రెండు రోజుల కిందట నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించగా ఆమె గర్భం దాల్చినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులు బాలికను ప్రశ్నించగా కత్తి శ్రీనివాసులు తనపై అఘాయిత్యానికి పాల్పడినట్లు వివరించింది. దీంతో బాలికను పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రంగనాథగౌడ్ బాలికను వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు పంపి కేసు నమోదుచేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు బాలికను విచారించి కేసు దర్యాప్తు చేపట్టారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	98
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	210
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6620
వెండి కిలో ధర	రూ. 82,600
వెండి ఒక గ్రాము	రూ. 84.60

మంత్రి నారాయణకు వినతుల వెల్లువ



అర్జీ స్వీకరించి, వృద్ధురాలి సమస్యను వింటున్న మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 9 : కలెక్టర్‌లో శుక్రవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. ఒక దశలో తోపులాట జరగడంతో అందరికీ టోకె న్లు ఇచ్చి లోపలికి అనుమతించాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూసమస్యలు పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు, పించన్లు ఇప్పించాలని, ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ పలువురు అర్జీలు సమర్పించారు. అందరినీ మంత్రి అర్జీలు స్వీకరించి పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేశారు.

● తనకు కళాకారుల కోటాలో 1990లో భూమి మంజూరైనా ఇంత వరకు చూపించ లేదని కొడవ లూరు మండలం రామన్నపాళెంకు చెందిన కళాకారుడు సూర్య ప్రకాష్ వినతిపత్రం ఇచ్చారు. తనకు ప్రభుత్వం మంజూరు చేసిన భూమిని కేటాయించాలని కోరారు.



అర్జీలు ఇచ్చేందుకు పోటీ పడుతున్న జనం

● నెల్లూరులోని ఇస్కాన్ మందిరం ఎదురుగా ఉన్న తమ స్థలంలో కాలువ తవ్వారని, దానిని తొలగించి వేరేచోట కాలువ తవ్వేలా చూడాలని కోరుతూ నగరానికి చెందిన వేమారెడ్డి రవిచంద్రారెడ్డి కుటుంబసభ్యులు అర్జీ ఇచ్చారు.

● నగరంలోని హరనాథపురంలో ప్రజా నాయకుడు ఆనం వెంకటరెడ్డి విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలని కోరుతూ వెంకటరెడ్డి అభిమా నులు వినతి పత్రం సమర్పిం చారు.

● సిరిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ నేత మిడతల రమేష్ ఆధ్వర్యంలో నేతలు వినతి పత్రం ఇచ్చారు.

● కొత్తూరు ప్రాంతంలో ఈద్గా సమస్యను పరిష్కరించాలని కోరుతూ మైనార్టీ నేత ఆషిక్ అలీ ఖాన్ వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై ఎమ్మెల్యే కోటంరెడ్డి మంత్రి నారాయ ణకు వివరించారు. దీంతో స్వయంగా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

● భవన నిర్మాణాలకు ఇసుక అందుబాటులో లేదని, దానిని అందుబాటులో ఉంచాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి అల్లాడి గోపాల్, నగర కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు అర్జీ ఇచ్చారు.



● తనకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని వెంకటేశ్వరపురం టిడ్కో కాలనీకి చెందిన ఉష అనే మహిళ మంత్రిని వేడుకుంది.



● కొత్తూరులోని మల్లమ్మ గుంటకు చెందిన కోమల, తిరుపతమ్మ, ఇంద్రజ, అంజమ్మ తదితరులు తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.



రేపు జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), ఆగస్టు 9 : జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర మధు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గల స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 9 గంటలకు జరిగే ఈ ఎంపికలకు 15 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులు హాజరు కావాలన్నారు. ఆసక్తి కలిగిన వారు స్విమ్మింగ్ కోచ్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ 8801916198 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు జడ్పీ సమావేశం

● మంత్రులను ఆహ్వానించిన చైర్‌పర్సన్

● ప్రజాప్రతినిధులతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక

నెల్లూరు (జడ్పీ): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరగనుంది. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి ఈ సమావేశం జరుగుతుంటుంది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది తొలి సమావేశం. అయితే జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు అందరూ అధికార కూటమికి చెందిన వారుకాగా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, సభ్యులు వైసీపీకి చెందిన వారు కావడం విశేషం. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జరిగే సమావేశంలో ప్రధానంగా వ్యవసాయ, జలవనరులు, వైద్యఆరోగ్యం, స్త్రీ,శిశు సంక్షేమం, విద్యాశాఖలపై సమావేశంలో సమీక్ష జరపనున్నారు.

మంత్రులకు ఆహ్వానం

జిల్లా పరిషత్ సమావేశానికి హాజరుకావాలని రాష్ట్ర పురపాలక, దేవదాయ శాఖల మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిని జడ్పీ చైర్‌పర్సన్ ఆహ్వానించారు. చైర్‌పర్సన్ అరుణమ్మ, ఆమె భర్త డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి శుక్రవారం మంత్రి నారాయణ నివాసానికి వెళ్లి ఆహ్వానించారు. మంత్రి రామనారాయణరెడ్డి విజయవాడలో ఉండటంతో ఫోన్ చేసి ఆహ్వానించారు. కాగా, జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీలో ఒక్కో కమిటీకి స్థాయి సంఘ కమిటీ సభ్యులుగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉంటారు. అయితే ఇటీవలి ఎన్నికల్లో వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ ఓడి పోవటం, కూటమి పక్షం వారు విజయం సాధించడంతో వారందరినీ స్టాండింగ్ కమిటీకి ప్రత్యేకంగా ఎన్నుకోనున్నారు.

వెంకయ్యనాయుడును కలిసిన నేతలు, అధికారులు



వెంకయ్యనాయుడుతో చవటపాలెం గ్రామ రైతులు

వెంకటాచలం, ఆగస్టు 9: జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉన్న భారతదేశ పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును శుక్ర వారం పలువురు అధికారులు మర్యాదపూర్వ కంగా కలిశారు. ఎస్సీఈఆర్టీ కేంద్ర సంస్థకు అప్పగించిన భూముల పరిహారం ఇంకా మంజూరు చేయలేదని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన వెంకయ్య నాయుడు ఫోన్‌ద్వారా ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరగా నిధులు మంజూరు చేయమని సూచించారు. అలాగే ఎన్డీఏ కూటమి నేతలు, గ్రామస్థులు వెంకయ్యనాయుడును కలిశారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణా నికి నిధులు మంజూరు చేసేలా చూడాలని గ్రామస్థులు కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నేతలు వెంకయ్య నాయుడును కలిసి వర్గీకరణ రిజర్వేషన్ అంశంలో అందించిన సహాయం ఎనలేనిదని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చవటపాలెం గ్రామస్థులు ఆరుముళ్ల మురళీ, శ్రీనివాసులునాయుడు, వెంకటేశ్వర్లు, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఉచితంగా కేన్సర్ స్ర్కీనింగ్

● పురపాలక శాఖమంత్రి పొంగూరు నారాయణ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న మంత్రి, కలెక్టర్, ఇతర అధికారులు

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 9 : ఈ నెల 15వ తేదీ నుంచి ఉచితంగా కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. పీఎంపీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గోడ పత్రికను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్‌పై ప్రజలకు అవగాహన అవరమని చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ముందుకు రావటం అభినందనీయమన్నారు. కేన్సర్ పరీక్షలు ప్రతి ఒక్కరు చేయించుకోవాలన్నారు. పీఎంపీ సంఘం జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ కేన్సర్ స్రీనింగ్‌పై విస్తృత ప్రచారం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నా రాజకీయ భవితకు నెల్లూరులోనే పునాది

● ధర్మవరంలో గెలుపు కోసం ఇక్కడి నుంచి కార్యకర్తలు వచ్చారు

● మంత్రి పదవి ముళ్ల కిరీటంలా ఉంది

● కార్యకర్తలకు ఎల్లవేళల అండగా..

● రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 9 : విద్యార్థి దశలో ఉన్నప్పుడు నెల్లూరు పోరాటాల గురించి ఎంతో గొప్పగా చెప్పుకునే వాళ్లం.... పుట్టింది రాయలసీమ అయినా.. విద్య మదనపల్లెలో సాగినా.. నా రాజకీయ భవిష్యత్తుకు పునాది పడింది మాత్రం నెల్లూరు నుంచే అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి నేతృత్వంలో నెల్లూరులోని కిలారి వెంకటస్వామి నాయుడు కల్యాణ మండపంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ సామాజిక, భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా బీజేపీ నుంచి ధర్మవరం శాసన సభ్యుడిగా పోటీ చేయాల్సి వచ్చిందన్నారు. తన గెలుపు కోసం నెల్లూరు నుంచి కార్యకర్తలు ధర్మవరం వచ్చి ప్రచారం చేశారని, వారిని ఎప్పటికీ మరిచిపోనన్నారు. నెల్లూరుకు వచ్చినప్పుడల్లా పుట్టింటికి వచ్చిన భావన కలుగుతుందని, నెల్లూరుకు వచ్చి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడు తుంటే రీచార్జ్ అయినట్లు ఉంటుందన్నారు. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా మంత్రి పదవి ముళ్ల కిరీటంలా భారంగా ఉందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను ధ్వసం చేశారన్నారు. పైగా కూటమి ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని త్వరలోనే గాడిన పెట్టేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నా మన్నారు. రాష్ట్ర, జిల్లా అభివృద్ధిలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సహకారం మరవలేనిదని గుర్తు చేశారు. ప్రధాని మోదీ పాలనలో దేశవ్యాప్తంగా బీజేపీ బలపడుతోందని, ప్రతి కార్యకర్త జిల్లాలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమస్యలు తెలుసుకునేందుకు త్వరలోనే బీజేపీ జిల్లా కార్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వంలో బీజేపీ ఒక భాగమే తప్ప బీజేపీనే ప్రభుత్వం కాదని కార్యకర్తలు తెలుసుకోవాలన్నారు. కార్యకర్తలకు ఏ సమస్య ఉన్నా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం నియోజక వర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలు మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సురేష్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, సెల్స్ ఇన్‌చార్జి పీ సురేందర్‌రెడ్డి, అధికార ప్రతినిధులు ఆర్డీ విల్సన్, సామంచి శ్రీనివాసులు, నాయకులు కందుకూరి సత్యనారాయణ, వెంకయ్య నాయుడు, గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్, బైరి శ్రీనివాసులు, మిడతల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌లో అనర్హులను తొలగించాలి

● కార్మికుల నిరసన ప్రదర్శన, భిక్షాటన ● మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కావలి, ఆగస్టు 9: కావలి పురపాలక సంఘంలో అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై ఆప్కాస్‌లో చేర్చిన అనర్హులను తొలగించి అర్హులకు అవకాశం కల్పించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, కార్యవర్గ సభ్యుడు మల్లె అంకయ్య డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కావలి పట్టణంలోని సీపీఐ కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన చేపట్టిన దినసరి కార్మికులకు వేతనాల కోసం భిక్షాటన చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేసి కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపాల్టీలో 2016 నుంచి దినసరి కూలీలుగా 57 మంది పనిచేస్తుండగా వారిని కాదని కొత్తగా 27 మందిని ఆప్కాస్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేర్చుకున్నారన్నారు. వారిలో ఇద్దరు మాత్రమే అర్హులని, అనర్హులైన మిగిలిన 25 మందిని తొలగించి వారి స్థానంలో అర్హులైన కార్మికులను చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. దినసరి కార్మికులకు 4 నెలలుగా వేతనాలు అందడంలేదన్నారు. పట్టణ జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జూలై నెల జీతాలు ఇంకా అందలేదన్నారు. 2019లో పర్మినెంట్ కార్మికుడు కత్తి కోటేశ్వరరావు మరణిస్తే వారి కుటుంబానికి నేటికీ బెనిఫిట్స్ అందలేదన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలలకు కార్మికులకు హెల్త్ అలవెన్స్‌లు చెల్లించలేదన్నారు. 2020 నుంచి కార్మికులకు సబ్బులు, నూనెలు, చెప్పులు ఇవ్వలేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి గుంజి కిషోర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి రవి, వర్కర్స్ యూనియన్ నేతలు ప్రభావతి, రాజేష్, పద్మ, రమాదేవి, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), ఆగస్టు 9 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండో విడతలో భర్తీ కాని సీట్లలో ప్రవేశాలకు మూడోవిడత కౌన్సెలింగ్ నిర్వహి స్తున్నట్లు ఐటీఐ కళా శాలల జిల్లా కన్వీనర్ కే శ్రీధర్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 26వతేదీ లోపు దరఖాస్తును రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాత అభ్యర్థులకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారన్నారు. అభ్యర్థి ఈ దరఖాస్తును ప్రింట్ తీసుకుని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 27వతేదీన తాను చేరదలచుకున్న ఐటీఐ కళాశాలలో హాజరై, సర్టిఫికెట్లను ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలలో చేరేందుకు 29వతేదీన, ప్రైవేట్ ఐటీఐలలో చేరేందుకు 31వతేదీన కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

సోమశిలకు 11,044 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారానికి 14.783 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 10129 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా దిగువ డెల్టా 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

వ్యవసాయ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

● ఆత్మకూరు, ఉదయగిరిలో రైతు సంఘం నాయకుల ఆందోళన

ఆత్మకూరు, ఆగస్టు 9: కేంద్రం చేపట్టనున్న వ్యవసాయ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వివిధ కార్మిక సంఘాల నేతలు క్విట్ కార్పొరేట్ నినాదాలతో శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడారు. వ్యవసాయరంగ ప్రైవేట్ శక్తులకు అప్పగించే నిర్ణయంతోనే ఎరువుల సబ్సిడీని తగ్గించడం, పంటలకు మద్దతు ధర ప్రకటించక పోవడమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆత్మకూరు నాగయ్య, డేవిడ్ రాజు, నాగేంద్ర, యువజన కాంగ్రెస్ నాయకుడు వన్నం నాగరాజు, ఐద్వా నాయకులు లక్ష్మమ్మ, పద్మ, ఆటో వర్కర్స్, టైలర్స్ యూనియన్ నాయకులు రమణయ్య, మహబూబ్‌బాషా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్ పాల్గొన్నారు.



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ఉదయగిరి రూరల్: వ్యవసాయ రంగాన్ని కేంద్రం కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టకుండా చూడాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు రైతులతో కలిసి స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. ప్రధాని మోదీ రైతుల ఆదాయం రెట్టింపు, ఆత్మహత్యలు లేకుండా చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సూచన మేరకు పంటలకు మద్దత ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మిగిలాయన్నారు. రైతు, కౌలు రైతులకు వెంటనే పెట్టుబడి సాయం విడుదల చేయాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో సబ్సిడీతో ఎరువులు అందజేయడంతో పాటు పంట ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్నారు. పేదల భూములను ఉపాధి పనులతో అభివృద్ధి చేయాలన్నారు. కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, ఫరుద్దీన్‌బాషా, గడ్డం నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఉదయగిరి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగుపర్చాలి: డీఈవో


సంగం: విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్

ఏఎస్ పేట, ఆగస్టు 9: ఉన్నత విద్యనందించి విద్యార్థుల సామర్థ్యంను మెరుగుపర్చాలని డిప్యూటీ డీఈవో గోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన చిరమన జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల సామర్థ్యంను తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగం: కొరిమెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈవో గోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. శిథిలావస్థ భవనంతో ప్రమాదం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్‌ఎంను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో జానకిరాం ఉన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

కలువాయి, ఆగస్టు 9: స్థానిక బస్టాండు రోడ్డుకు అడ్డంగా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు అధిక లోడ్‌తో వెళుతున్న వాహనం తగిలి తెగిపడ్డాయి. ఈ సమయంలో జనం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల కాలంలో చాలాసార్లు ఈ తీగలు తెగిపడ్డాయి. విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం వాపోతున్నారు. మండల జనసేన నాయకులు ఈ విషయాన్ని మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు విద్యుత్ సిబ్బంది స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

నేడు సరఫరాలో అంతరాయం

శనివారం కలువాయి, చింతలాత్మకూరు, కుల్లూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనులు, 11కేవీ లైన్ వెంబడి చెట్లు తొలగింపు పనులతో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గూడూరు డీఈ ఏ.రవికుమార్ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు అందుకు సహకరించాలని కోరారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున వినియోగదారులు గమనించి అందుకు సహకరించాలని కోరారు.

కావలి: ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కావలి పట్టణం, రూరల్ మండలంలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు డీఈఈ శ్రీనివాసులు రెడ్డి, టౌన్ ఏఈ వసంతరావులు ఒక ప్రకటనలో తెలిపారు.

వింజమూరులో అన్న క్యాంటీన్ ప్రారంభం


అన్న క్యాంటీన్ ప్రారంభించి వృద్ధుడికి భోజనం వడ్డిస్తున్న నాయకులు

వింజమూరు, ఆగస్టు 9: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దాతృత్వంతో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మాజీ జడ్పీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, ఉదయగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ చంద్ర మధుసూదన్ రావు, మాజీ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చెంచలబాబుయాదవ్ మాట్లాడారు. మూడేళ్లుగా కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అందులో భాగంగానే ఈ క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దుత్తలూరు మాజీ ఎంపీపీ కుర్రి రవీంద్రబాబు, రఘునాథరెడ్డి, దంతులూరి వెంకటేశ్వర్లు, సీహెచ్ బయ్యన్న, ప్రభాకర్‌రాజు, చల్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, ఆగస్టు 9: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం నాగరాజు, పట్టణ కార్యదర్శి హజరత్తయ్య మాట్లాడారు. మున్సిపాలిటీ విభాగాల కార్మికులకు జీతాలు పెంచాలని, యూనిఫారం దుస్తులు, సబ్బులు, చమురు, పాదరక్షలు ఇవ్వాలని కోరారు. ఈపీఎఫ్ రశీదులు అందజేయాలన్నారు. ఈ మేరకు కమిషనర్ షేక్ ఫజులుల్లాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మునీర్‌బాబు, ఉపకార్యదర్శి చెంచయ్య, ట్రెజరర్ కృష్ణయ్య పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

వింజమూరు, ఆగస్టు 9: ధరిణి సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తూరులో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి ఆర్‌వో ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధరణి సేవా సమితి ప్రతినిధి యల్లాల రఘురామిరెడ్డి మాట్లాడారు. ప్రొఫెసర్ యల్లాల వెంకటరామిరెడ్డి, ధరణి సేవా సమితి మేనేజింగ్ ట్రస్ట్ యల్లాల మంజుల చొరవ, కొత్తూరు రిలయన్స్ ఫౌండేషన్ వితరణతో స్థానిక ప్రజలు దాహార్తిని తీర్చేందుకు ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, యల్లాల శ్రీనివాసులరెడ్డి, గూడా నర్సారెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, గుణ్ణం ప్రసాద్ రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, గణపం రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ఆత్మకూరు, ఆగస్టు 9: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల చంద్రారెడ్డి, పల్లవోలు జయాకర్ తెలిపారు. చింతగుంట గోపాల్‌రెడ్డి వితరణగా అందజేసిన ప్లేట్లు, గ్లాసులు, పలకలను శుక్రవారం ఆయన శాంతినగర్, నరసాపురం అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు పంపిణీ చేశారు. చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, అల్లంపాటి వెంకటేశ్వర్లురెడ్డి, అల్లంపాటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.


చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న నేతలు

సీఐ గంగాధర్‌కు సన్మానం


సీఐ గంగాధర్‌ను అభినందిస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 9: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌రావును శుక్రవారం టీడీపీ నేతలు కలిసి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్ష, కార్య దర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయ భాస్కర్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం కార్యదర్శి మద్దినేని నారాయణ, టీఎస్ ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు పయ్యావుల మారుతి నాయుడు, రాచూరు రమణయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

అనంతసాగరం, ఆగస్టు 9: బొమ్మవరం, లింగంగుంట రైతు సేవాకేంద్రాల్లో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడకుండా సాంకేతిక యాజమన్య పద్ధతులతో సాగుచేసే పద్ధతులను వివరించారు. భూమి విషతుల్యం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శైలజకుమారి, గీతాకుమారి, శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మెట్టుకూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు చేయండి

సీతారామపురం, ఆగస్టు 9: రైతులు సాగు చేసిన పంటలను త్వరిగతిన ఈ క్రాప్ బుకింగ్ చేయించుకో వాలని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి సూచించారు. శుక్రవారం అయ్యవారిపల్లిలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం సాగులోని మొక్కజొన్న పంటను పరిశీలించి కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించారు. నివారణకు లీటరు నీటికి 0.5 గ్రాములు ఇమామెక్టిన్ బెంజోయేట్ పిచికారి చేయాలన్నారు. సబ్సిడీ డ్రిప్పు పరికరాల కోసం రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 9: కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి అన్నారు. శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పెళ్లి రోజును పురస్కరించుకొని విద్యార్థులకు చికెన్ బిర్యానీ, స్వీట్, వడ, ఐస్‌క్రీమ్, అరటిపండు అందజేశారు. వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసులు, హెచ్‌ఎం బలరామయ్య, ఎస్ఎంసీ చైర్మన్ రసూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సంగంలో మంత్రి పర్యటన

సంగం, ఆగస్టు 9: మండలంలో శనివారం దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటించనున్నట్లు డీపీఆర్‌వో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు దువ్వూరు నేషనల్ హైవే సమీపంలో నిర్మించిన శ్రీమల్లి మిల్క్ డెయిరీ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 9: విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత శిఖరాలను చేరుకునేలా లక్ష్యాలను నిర్ణయించుకోవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుత్తలూరు, వరికుంటపాడు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యాబోధన చేసే సమయంలో శ్రద్ధగా వినాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీడ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రియాజ్‌కు సన్మానం


రియాజ్‌ను సన్మానిస్తున్న ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 9: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఎంపికైన పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు శుక్రవారం టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్‌ను కలిసి సన్మానించారు. టీడీపీ సానుభూతిపరుల విజయానికి సహకరించడంతో ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కమిటీ చైర్మన్ షేక్ మహబూబ్‌బాషా, సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ సందానీ, ఖాదర్‌బాషా, నవాజ్ ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 9: యాజమాన్య కమిటీలు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో-1 షేక్ మస్తాన్‌వలి సూచించారు. శుక్రవారం గండిపాళెం జిల్లా పరిషత్, మెయిన్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల యాజమాన్య కమిటీలతో సమావేశమై అభివృద్ధికి సలహాలు అందజేశారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు.

మెలకువలతో పంట సాగు చేయాలి

మర్రిపాడు, ఆగస్టు 9: రైతులు మెలకువలతో పంటలు సాగు చేయాలని జిల్లా వనరుల కేంద్ర ఏడీ మారుతీదేవి శుక్రవారం పడమటినాయుడుపల్లి, చుంచులూరు గ్రామాల రైతులకు శిక్షణ ఇచ్చారు. వాతావరణంలో మార్పులకు అనుగుణంగా సాగులో మార్పులు చేయాలని వివరించారు. రైతులు సుస్థిర ఆదాయం పొందేందుకు పశుగ్రాస సాగు, పెరటి కూరగాయలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ మధురిమ, మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత ఆంధ్రప్రదేశే లక్ష్యం

● రాష్ట్ర మంత్రి సత్యకుమార్ ● కావలిలో ఘన స్వాగతం

కావలిటౌన్, ఆగస్టు 9: రాష్ట్రాన్ని వికసిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ వెల్లడించారు. శుక్రవారం నెల్లూరు పర్యటనకు వెళుతున్న మంత్రికి పట్టణ సమీపంలోని మద్దూరుపాడు జాతీయ రహదారిపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి బీజేపీ శ్రేణులతో కలిసి అల్పాహార స్వీకరించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ హామీలు నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని, దానిని జీర్ణించుకోలేని వైసీపీ ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించే లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆర్‌డీ విల్సన్, కంచర్ల మురళీకృష్ణ, వీవీ రంగారెడ్డి, బ్రహ్మానందం, కమల, మాధవి, వెంకటేశ్వర్లు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు కనిపించకపోవడం చర్చనీయంశమైంది.


కావలిలో మంత్రి సత్యకుమార్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

కందుకూరు : రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్‌ను నెల్లూరులో కందుకూరు నియోజకవర్గ బీజేపీ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కందుకూరు ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల గురించి మంత్రి కి వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి గట్టమనేని హరిబాబు, పార్టీ నేతలు జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, జగన్నాథం వైకుంఠం, పీవీ కృష్ణారెడ్డి, చుండి మురళీధర్, మాల్యాద్రినాయుడు పాల్గొన్నారు.

కొండాపురం : కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేయాలని కోరుతూ రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున కోరారు. ఈ మేరకు నెల్లూరు పర్యటనకు వెళుతూ మార్గమధ్యంలో కావలిలో ఆగిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. 23 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం గోడలు దెబ్బతిన్నాయన్నారు. మండలం చుట్టుపక్కల 50 కిలోమీటర్లలోపు మంచి వైద్యశాలలు లేవని, 45 వేలకుపైగా జనాభా ఉన్న మండలానికి 30 పడకలతో 24 గంటలు వైద్యం అందేలా నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. చింతలదీవి సమీపంలోని జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా చినమాలకొండయ్య, కొమ్మి కోటయ్య, హనుమారెడ్డి తదితరులు ఉన్నారు.

లింగసముద్రం : లింగసముద్రం పీహెచ్‌సీలో పరికరాలు, మందుల కొరత సమస్యలు పరిష్కరించాలని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఘట్టమనేని హరిబాబు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఏడుకొండలు, చంద్రశేఖర్, ప్రసాద్, వైకుంఠం పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, ఆగస్టు 9 : మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాగునీరు, లోవోల్టేజీ, చేతి పంపులు, వీధి దీపాలు, తదితర సమస్యలపై చేవూరు, గుడ్లూరు, పొజర్ల, రాళ్లపాడు గ్రామ సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గుడ్లూరు మెయిన్ బజార్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ బోర్డులు ఏర్పాటు చేయాలని ఉలవపాడు ప్రాజెక్ట్ అధికారులకు సూచించారు. ముందుగా గుడ్లూరులోని గంగపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం పునఃనిర్మాణానికి చేపట్టిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంపీపీ పులి రమేష్, తహసీల్దార్ స్వర్ణలత, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఉపాధి హామీ కూలి చెల్లించాలి

కావలిటౌన్, ఆగస్టు 9: మూడు నెలల ఉపాధి హామీ కూలి డబ్బులు తక్షణం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరు మాల్యాద్రి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మూడు నెలల నుంచి ఉపాధి హామీ కూలి డబ్బులు రాక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రం బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించిందని, అందులో బకాయిలు రూ.41వేల కోట్లు పోతే మిగిలిన రూ.45వేల కోట్లు ఏమూలకు వస్తాయని ప్రశ్నించారు. వికసిత్ భారత్ అంటే వ్యవసాయ కూలీలు ఆకలితో అలమటించడమేనా అని ఆవేదన చెందారు. సమావేశంలో నాయకులు సీతారామయ్య, రాధాకృష్ణయ్య, జాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన

బిట్రగుంట, ఆగస్టు 9: విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మి అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో శుక్రవారం వ్యవసాయంపై అవగాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, సహోపాధ్యాయులు రేణుక, శివపార్వతి తదితరులు ఉన్నారు.

ఆదివాసులు ప్రకృతి కన్నబిడ్డలు : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, ఆగస్టు 9: ప్రకృతి కన్న బిడ్డలు ఆదివాసులని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు వెనుక వీధిలోని ఓ కల్యాణ మండపంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ పూర్వం అందరం ఆదివాసులేనని, నాగరికత పెరిగే క్రమంలో ప్రాంతాలు, ఆచార వ్యవహారాలు, చేసే వృత్తులు, జీవన విధానాలను బట్టి మనుషులు వర్గాలుగా విభజింపబడ్డారన్నారు. మొగిలి కల్లయ్య విన్నపం మేరకు వచ్చే ఏడాది ఆదివాసి దినోత్సవం నాటికి కావలి పట్టణంలో ఏకలవ్యుడి విగ్రహాన్ని తన స్వీయ నిధులతో ఏర్పాటు చేయిస్తానని ప్రకటించారు. ఆర్డీవో శీనానాయక్ మాట్లాడుతూ ప్రకృతి ప్రేమికులు ఆదివాసులని, అడవి తల్లి వడిలో వదికిపోయిన కల్మషం లేని మనుషులన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నేతలు బోగిరి యోహాన్, ప్రభాకర్, టీ రవి, టీడీపీ నేతలు జ్యోతి బాబురావు, గుత్తికొండ కిషోర్, తిరివీధి ప్రసాద్, అర్షియా తదితరులు పాల్గొన్నారు.


నెమలి ఈకలు, క్యాడ్‌బాళ్లు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే

గిరిజనుల హక్కులు కాపాడుకోవాలి

బిట్రగుంట : అనగారిన గిరిజనుల జీవితాలు మారాలంటే మొదట హక్కుల కోసం పోరాటం చేయాలని గిరిజన నాయకుడు కావాటి శ్రీనివాసులు అన్నారు. బోగోలు మండలం కప్పరాళ తిప్ప సమీపంలోని రామాపురం కూడలిలో ప్రపంచ ఆదివాసుల దినోత్సవ సందర్భంగా శుక్రవారం ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలు వేసి పుష్పాంజలి ఘటించారు.

గోశాల నిర్మాణానికి శంకుస్థాపన

కావలి రూరల్, ఆగస్టు 9 : మండలంలోని రుద్రకోటలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో గోశాల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. గోశాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మునగాల జగన్మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కాండ్ర కుటుంబానికి పరామర్శ

బిట్రగుంట : బోగోలు మండలం నాగులవరంకు చెందిన టీడీపీ జిల్లా నేత కాండ్ర రఘురాం నాయుడు తల్లి కాండ్ర రాగమ్మ (94) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచు గనేషం రమేష్‌రెడ్డి, నేతలు చిలకపాటి వెంకటేశ్వర్లు, గనిపినేని నాగరాజు, లకాకుల మాధవరావు, పుట్టా సుబ్బారావు, క్రాంతి తదితరులు ఉన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

● ఎస్ఆర్‌డీఏ జేడీ రామనాథం

కందుకూరు, ఆగస్టు 9: మండలంలోని మహదేవపురంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎస్ఆర్‌డీఏ జేడీ రామనాథం అన్నారు. శుక్రవారం ఆయన ఆ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన వర్మీకంపోస్టు బెడ్‌లను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ కేంద్రం నిర్వహణ చక్కగా ఉన్నందున ఆహ్లాదకర వాతావరణం ఉండేలా మొక్కలు, పూలచెట్లు పెంచాలని సూచించారు. నీటిసౌకర్యం ఉన్నందున కూరగాయల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం రాబట్టాలని తెలిపారు. ఈ కేంద్రం మిగిలిన గ్రామపంచాయతీలకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.ప్రమీలారాణి, ఈవోఆర్డీ ఎస్.చంద్రసేన్, ఆర్‌డబ్ల్యూఎస్ రీసెర్స్ కో ఆర్డినేటరు రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.


సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామనాథం

పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కావలి రూరల్, ఆగస్టు 9: పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్పీడీవో శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కావలి ఎమ్పీడీవో కార్యాలయంలో శుక్రవారం పారిశుధ్యం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారిశుద్ధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణలో పంచాయతీల పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం రుద్రకోటలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి ఎస్‌కె. అబ్దుల్ సమద్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎమ్పీడీవో

సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

అల్లూరు : గ్రామీణాభివృద్ధి జరగాలంటే ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాల్సిన అసరముందని, ప్రధానంగా సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు. గ్రామ కార్యదర్శులు, సర్పంచెలకు చేపట్టిన శిక్షణ తరగతుల్లో భాగంగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పరిశుభ్రత, సంపద తయారీలపై గ్రద్దగుంట పంచాయతీలో ప్రయోగాత్మకంగా చేపట్టి వివరించారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

కావలిటౌన్, ఆగస్టు 9: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అడిషినల్ జుడిషియల్ న్యాయాధికారి విక్రమ్ సిన్హా పేర్కొన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీసాయి కళాశాలలో మాదక ద్రవ్యాలనిర్మూలన అంశంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారి పరశురామ్, న్యాయవాది కెనడి, లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, లోక్‌అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, ప్రిన్సిపాల్ వలి తదితరుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి విక్రమ్ సిన్హా

గర్భిణులకు టానిక్‌ల పంపిణీ

కావలి, ఆగస్టు 9: గర్భిణులు, బాలింతలకు స్థానిక వెంగళరావునగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో పీఎం సురక్షిత మాతృత్వ పథకంలో భాగంగా శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి ఐరన్‌ఫోలిక్, కాల్షియమ్, విటమిన్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గొట్టిపాటి మాలినీదేవి, డాక్టర్ రమ్య, రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, సీవో ప్రసాద్, సుగుణమ్మ పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీలో పీఎం మాతృత్వ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జిహారిక, వైద్యులు నిత్యప్రశాంతి, ప్రవీన్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కులు పాల్గొన్నారు.

ఒకటో పట్టణ సీఐ బాధ్యతల స్వీకరణ

కావలి, ఆగస్టు 9: కావలి ఒకటో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎండీ ఫిరోజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సీఐ రాజేష్ ఇక్కడ నుంచి బదిలీ కాగా ఆయన స్థానంలో కలిగిరి సీఐగా ఉన్న ఫిరోజ్‌ను నియమించారు.

కందుకూరు సీఐ..

కందుకూరు : కందుకూరు సీఐగా కె.వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం పట్ల తనకు అవగాహన ఉందని, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతామన్నారు.

గుడ్లూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్..

గుడ్లూరు : గుడ్లూరు సర్కిల్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా మంగారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న సుబ్బారావు రేంజ్ కార్యాలయానికి బదిలీ కావడంతో పల్నాడు జిల్లా పెద్దకూరపాడు సర్కిల్‌లో పనిచేస్తున్న జి.మంగారావు నియమించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా ఎడ్లబండి పోటీలు

దగదర్తి(బిట్రగుంట), ఆగస్టు 9: దగదర్తి గ్రామంలో వెలసి ఉన్న గంగమ్మ జాతరలో భాగంగా శుక్రవారం ఎడ్లబండి పరుగు పందాలు నిర్వహించారు. దగదర్తి మండలమే కాకుండా ఇతర మండలాల నుంచి దాదాపు 32 జతల ఎడ్లబండ్లు పోటీలో పాల్గొన్నాయి. తూర్పుపల్లె పాలెం పాటూరు ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. విజేతకు మాలేపాటి భానుచందర్ నాయుడు, సుధాకర్ నాయుడులు రూ.20 వేల, ట్రోఫీ అందచేశారు. ద్వితీయ స్థానంలో యల్లాయపాలెం ఎడ్లకు రూ.15 వేలు, మూడవ స్థానంలో నిలిచిన కోవూరు ఎడ్లకు రూ.10 వేలు, 4వ స్థానంలో ముదివర్తి రూ.8 వేల, ఐదవ స్థానంలో యల్లాయపాలెం రూ.6 వేల గెలుచుకున్నారు. సాయంత్రం గెలుపొందిన వారికి పెద్దలు మారుబోయిన శ్రీనివాసులు, కాకర్ల ప్రభాకర్, వింజం కొండప నాయుడు, మెత్తాళ్ల సురేష్, బహుమతులను అందచేశారు.


బహుమతి అందజేస్తున్న టీడీపీ యువనేత భానుచందర్‌నాయుడు

వైభవంగా గంగమ్మ కొలుపు మహోత్సవం

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, ఆగస్టు 9: పట్టణంలోని శివాలయం వీధిలో వున్న గంగమ కొలుపు మహోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం కుంకుమపూజ, పుణ్యాహవచనం, అభిషేకం, సహస్రనామార్చన, మధ్యాహ్నం ఆచారం తెలియజేసి, సాయంత్రం అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పెద్దగొల్ల సారె మద్దిరెళ్ల నరసింహులుయాదవ్ ఇంటి నుంచి శేషవస్త్రాలు గంప, చేట తదితరాలను తీసుకొచ్చి అందజేశారు. పుట్టింటి సారె యరగర్ల జయరామయ్య ఇంటి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కూటమి ప్రభుత్వంతో వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి

వైసీపీ హయాంలో కుదేలైన వ్యవసాయ, ఉద్యాన రంగాలకు కూటమి ప్రభుత్వంతో కొత్త ఊపిరి వచ్చిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.36.74కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ ఐదేళ్లలో రూ.18.73లక్షలు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. మండలంలో నిమ్మ రైతులు మిచాంగ్ తుపాన్ దాటికి నష్టపోగా అప్పటి వ్యవసాయ మంత్రి కాకాణి నష్టపరిహారాన్ని రైతులందరికీ ఇవ్వకుండా, వైసీపీ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చారన్నారు. 2023-24కు సంబంధించి రైతులకు రూ.1.87కోట్ల రాయితీ బకాయిలు ఉండగా చంద్రన్న ప్రభుత్వం రూ.1.57కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, బొమ్మి సురేంద్ర, బక్కయ్యనాయుడు, పల్లారపు కృష్ణయాదవ్, ఆదాల సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 9: శ్రావణ శుక్రవారం సందర్భంగా జొన్నవాడ ఆలయం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో మొదటి శుక్రవారం సందర్భంగా కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి నిత్యకళ్యాణోత్సవం, రాత్రి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకిసేవలు నిర్వహించారు.

బాలాత్రిపుర సుందరికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

సైదాపురం, ఆగస్టు 9: స్థానిక బాలత్రిపుర సుందరీ దేవీ ఆలయంలో తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుకాల పూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 9: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శుక్రవారం బుచ్చి కొత్త తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏపీ సెక్రటరియేట్‌లో నీటిపారుదల శాఖలో సెక్షన్ అధికారిగా పనిచేస్తూ శిక్షణలో భాగంగా తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు. ఈసందర్భంగా ఓ వ్యక్తి ఫ్యామిలి మెంబరు సర్టిఫికెటు కోసం ఆయనకు అర్జీ సమర్పించి ఏడాదిగా తిరుగుతున్నా తహసీల్దార్లు, సిబ్బంది పట్టించుకోలేదని వాపోయాడు. పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విడవలూరు, ఆగస్టు 9: మండల పరిధిలోని ఊటుకూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఊటుకూరు, రామతీర్థం గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలన్నారు.

12 నుంచి శిక్షణ తరగతులు

మనుబోలు, ఆగస్టు 9: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12 నుంచి 3రోజుల పాటు సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల పంచాయతీవిస్తరణాధికారి జీవీఎస్‌వి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడురోజుల పాటు పంచాయతీల్లో పరిపాలన, విధులు, బాధ్యతలు, మౌలికవసతులు కల్పన, ప్రకృతివనరుల నుంచి పంచాయతీలకు ఆదాయ ఆర్జన, చెత్తసంపదకేంద్రాల నిర్వహణ గురించి శిక్షణ ఇవ్వనున్నారని ఆయన తెలిపారు.

మనుబోలు ఏఎస్‌ఐగా తిరుపాలు

మనుబోలు, ఆగస్టు 9: స్థానిక పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐగా జె తిరుపాలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పొదలకూరులో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న తిరుపాలు బదిలీపై మనుబోలుకు వచ్చారు. సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐకు ఎస్‌ఐ అజయ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

17న పశువుల సంత వేలంపాట

మనుబోలు, ఆగస్టు 9: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈనెల 17న పశువుల సంతకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి చెంచుప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనదలచినవారు దరావత్తు రూ. 10వేలు చెల్లించాలని, పాట దక్కించుకున్న వారికి ఏడాదిపాటు గడువు ఉంటుందని తెలిపారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

కోవూరు, ఆగస్టు 9 : ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు వైద్యాధికారి నిరంజన్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి తీసు కోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పౌష్టికాహారం, పండ్లు అందించారు. ఈవైద్యశిబిరంలో వైద్యసిబ్బంది కృష్ణమ్మ, ఉమామహేశ్వరి, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

నాడు- నేడు భవనాల పూర్తికి చర్యలు

● పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ కరీముల్లా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎంసీ చైర్మన్ కరీముల్లా తదితరులు

విడవలూరు, ఆగస్టు 9: ముదివర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద చేపట్టిన భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో పూర్తిచేస్తామని పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్‌కె కరీముల్లా తెలిపారు. గ్రామంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ పథకాల అమల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయులు చూడాలన్నారు. పాఠశాలల్లో వసతులు, విద్యార్థుల సమస్యలపై కమిటీ సభ్యులతో చర్చించి పరిష్కరిస్తానన్నారు. అనంతరం పాఠశాల చైర్మన్ కరీముల్లా, వైస్ చైర్మన్ గుమ్మడి లక్ష్మీసరోజాలను మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కె రఫీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బుచ్చి సీహెచ్‌సీని అభివృద్ధి చేయాలి

● వైద్య ఆరోగ్య శాఖామంత్రికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వినతి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు9: స్థానిక 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.2.5 కోట్లతో ఆధునీకరణతోపాటు వవ్వేరు, జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేయాలని శుక్రవారం నెల్లూరులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మెమొరాండం అందజేశారు. బుచ్చి ప్రభుత్వాసుపత్రిలో సెంట్రల్ ఆక్సిజన్ పైప్‌లైన్, పోస్టు మార్టం గది నిర్మాణం, డెంటల్ ఎక్సరే మిషన్, 50కేవీ జనరేటర్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట కళ్యాణ్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి వున్నారు. ప్రభుత్వ ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందేలా చూడాలని పలువురు బీజేపీ నాయకులు మంత్రి సత్యకుమార్‌ను కోరారు.

ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టండి : జనసేన

బుచ్చిలో నాసిరకంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్ శేషయ్యను బ్లాక్‌లిస్టులో పెట్టాలని జనసేన పార్టీ బుచ్చినాయకులు శుక్రవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయనపై విజిలెన్స్ ఎంక్వైరీ వేయాలని కోరారు.

గర్భిణులకు మహాయోగ సేవలు అభినందనీయం

● బుచ్చి సీహెచ్‌సీ వైద్యాధికారి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 9: గర్భిణులకు మహాయోగ (ట్రస్టు) హెల్పింగ్ సొసైటీ, దొడ్ల కోదండరామిరెడ్డి సేవలు అభినందనీయమని ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు అన్నారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకంలో భాగంగా శుక్రవారం బుచ్చిలో ప్రభుత్వాసుపత్రికి వచ్చిన గర్భిణులకు వైద్యాధికారులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మహాయోగ ట్రస్టు సభ్యులు లోకేష్, మనోజ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. దొడ్ల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు రక్తహీనత నివారణకు ఐరన్ టానిక్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశా వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో అదానీ విద్యార్థినికి బంగారు పతకం



బంగారు పతకం సాధించిన విద్యార్థిని కృష్ణ జషిత

ముత్తుకూరు, ఆగస్టు 9: కృష్ణపట్నంలోని అదానీ వరల్డ్ స్కూల్ విద్యార్థిని జి కృష్ణ జషిత రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ సిరియాల తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తాడిపత్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో వ్యక్తిగత, మిక్సిడ్ విభాగాల్లో తమ పాఠశాలకు చెందిన జి కృష్ణ జషిత అండర్ 14 కేజీ విభాగంలో బంగారు పతకాలను సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. విద్యార్థినికి అభినందనలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.

వైద్యశాఖ మంత్రిని కలిసిన బీజేపీ నేతలు

ఇందుకూరుపేట : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను శుక్రవారం జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి నెల్లూరులోని కిలారి తిరుపతి నాయుడు కల్యాణ మండపంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు మారుబోయిన శ్రీనివాసులు, ఇండ్ల రాఘవేంద్ర, ఇందుకూరుపేట మండల బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుపై హర్షం

పొదలకూరు : పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో త్వరలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించడం ఆనందంగా ఉందని టీడీపీ మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్‌బాబు అన్నారు.

ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలుపరచాలి

విడవలూరు, ఆగస్టు 9: పేదలకు, రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సక్రమంగా అమలుపరచాలని టీడీపీ మండలాధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు తెలిపారు. తహసీల్దారుగా నూతనంగా బాధ్యతలను తీసుకున్న చంద్రశేఖర్‌ని శుక్రవారం ఆయన మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాస్ పుస్తకాల జారీలో జాప్యం లేకుండా చూడాలని, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, డొంకలు ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు.

మైపాడు గేట్ ఘాట్‌కి పూర్వ వైభవం : మంత్రి నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని మైపాడు గేట్ ప్రాంతాల్లో శుక్రవారం పురపాలక మంత్రి పొంగూరు నారాయణ పర్యటించారు. అక్కడి ఘాట్‌ను పరిశీలించారు. ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మైపాడు గేట్ ఘాట్‌కి పూర్వ వైభవం తీసుకువస్తామని తెలిపారు. అనంతరం కిసాన్‌నగర్ వద్ద నూతనంగా నిర్మించిన షిరిడీ సాయిబాబా మందిరాన్ని దర్శించుకుని కుంభాభిషేకంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గరుడ, నాగపంచమి పూజ

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని మాగుంట లేఅవుట్ వెంటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం గరుడ పంచమి, నాగపంచమి పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా గరుడాళ్వార్‌కు, అనంతనాగేశ్వర స్వామికి విశేష తిరుమంజనం, పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కన్యకా పరమేశ్వరి ఆలయ పాలక మండలి అభినందన సభ

నగరంలోని స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ నూతన పాలక మండలి అభినందన సభ శనివారం జరగనుంది. ఈ కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు జరుగుతుందని ఏపీ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి పేగు షణ్ముఖరావు, జిల్లా సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్ తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు, (జడ్పీ): నగరంలోని రామ్మూర్తి నగర్, కిసాన్‌నగర్, వెంకటేశ్వరపురం, డైకాస్ రోడ్డు, హరనాథపురం, తెలుగుగంగ కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా సబ్‌స్టేషన్ల పరి ధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అమాత్యా... ఆలకించండి!

● వైద్య మంత్రి సత్యకుమార్‌కు ఉద్యోగ సంఘాల వినతి



మంత్రికి బొకే ఇచ్చి అభినందనలు తెలుపుతున్న అజీజ్ సోదరులు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 9 : వైద్య శాఖలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాలు ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందించాయి. శుక్రవారం నెల్లూరు పర్యటనకు వచ్చిన మంత్రిని పలు సంఘాల నాయకులు కలిసి సమస్యలను ఏకరువు పెట్టారు. ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు కలిసి వినతిపత్రం అందించారు. ఏపీవీవీపీలో వెటర్నరీ అసిస్టెంట్లకు 6 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. దాదాపు 15 ఏళ్ల నుంచి వేచి ఉన్న హెల్త్ అసిస్టెంట్లకు హెల్త్ సూపర్‌వైజర్లుగా, హెల్త్ ఎడ్యుకేటర్లుగా అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హంస ఉద్యోగ సంఘాల నేతలు ఇందిర, పరిమళ, మజురుల్లా, గౌస్‌బాషా, ఉమా, ధనలక్ష్మి, పృథ్వీ, బ్రహ్మేశ్వరి, మాధవ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ సంఘం నేతలు మంత్రిని కలిసి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్ వర్తింప చేయాలన్నారు. ఉద్యోగులకు వెంటనే ఐఆర్ ఇవ్వాలని, పీఆర్‌సీని పునరుద్ధరించాలని, డీఏ, సరెండర్ లీవు బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జీజీహెచ్‌లోని 350 మంది శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే ఇప్పించాలని విన్నవించారు. రేడియాలజీ విభాగంలో ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం అధ్యక్షకార్యదర్శులు కమ్మటి శ్రీనివాసులు, షేక్ సంధాని బాషా తదితరులు పాల్గొన్నారు.

● ఎన్‌జీవో మహాసంఘ్ నేతలు మంత్రిని కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాసంఘ్ కన్వీనర్ ఏవీ శేషయ్య, రాష్ట్ర కన్వీనర్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సమస్యలు పరిష్కరించండి

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కనీస వైద్య సౌకర్యాలు లభించక ఎందరో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని కలిసి 11 సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ మహిళా అధ్యక్షురాలు సుజాత, ప్రధాన కార్యదర్శి మణి, మనోజ్, కుమార్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సత్యకుమార్‌ను కలిసిన అజీజ్

నెల్లూరు నగరానికి వచ్చిన వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అజీజ్‌తోపాటు ఆయన సోదరుడు అబ్దుల్ జలీల్ కూడా ఉన్నారు.

మంత్రికి జనసేన నాయకుల సత్కారం



మంత్రితో జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 9 : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను శుక్రవారం జీజీహెచ్‌లో జనసేన పార్టీ నాయకులు కలిసి సత్కరించారు. పార్టీ సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబానికి చెందిన సత్యకుమార్ స్వయంకృషి, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించడం హర్షణీయమన్నారు. మంత్రి నెల్లూరు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గునుకుల కిషోర్, జమీర్, కృష్ణారెడ్డి, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

'వాత్సల్య' విద్యార్థినికి వివాహం



చిద్రూప లక్ష్మి వివాహ వేడుకలో దాతలు, నాయకులు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 9 : నగరంలోని వాత్సల్య అనాథాశ్రమంలో పుట్టిపెరిగి చదువుకున్న చిద్రూప లక్ష్మి అనే యువతికి ఆ ఆశ్రమంలోనే శుక్రవారం ఘనంగా వివాహం జరిగింది. నాయుడుపేటకు చెందిన సుమన్ అనే వరుడితో ఆశ్రమ నిర్వాహకులే తల్లిదండ్రులై స్ఫూర్తిదాయకంగా వివాహం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, మానవసేవయే మాధవ సేవ సంస్థ నిర్వాహకురాలు అరవ పరి మళ, ఇందిర, విశ్రాంత ఎస్సై పుల్లారెడ్డి, స్టాటిస్టికల్ అధికారి వాసుకి, విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు కల్లం శ్రీనివాసులు, వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు పాల్గొన్నారు.



నెల్లూరు జీజీహెచ్‌లో శుక్రవారం డయాలసిస్ యూనిట్ ప్రారంభోత్సవంలో వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో దాతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్ తదితరులు

వాహనాల వేగాన్ని నియంత్రించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులో పాదచారుల రద్దీ ఎక్కువగా ఉంటోందని ఆ రహదారి వాహనాల వేగాన్ని నియంత్రించాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో మంత్రి నారాయణకు వినతిపత్రం ఇచ్చారు. చిల్డ్రన్స్ పార్క్ రోడ్డులో రెండు రోజుల కిందట ఓ మహిళ వాహన చోదకుల వేగానికి బలైపోయిందని తెలిపారు. స్పీడ్ బ్రేకర్లు, వేగ పరిమితికి సంబంధించిన సూచికలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ మోడల్ స్కూల్స్ క్రీడా మైదానంలో అక్రమంగా రబ్బిష్, చెత్త తోలకం నిలిపేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. 50 ఏళ్లచరిత్ర కలిగిన ప్రభుత్వ నృత్య, సంగీత కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరారు.

రేపు గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల ప్రదానం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 9 : జిల్లాలోని గౌడ విద్యార్థులకు ఆదివారం నెల్లూరు పురమందిరంలో ప్రతిభ పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు గౌడ సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షుడు తోట ప్రభాకర్ గౌడ్ తెలిపారు. కోసూరు గోవిందయ్య గౌడ్ నివాసంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 220 మంది విద్యార్థులను పురస్కారాలకు ఎంపిక చేశామని, వారికి రూ.5వేల నగదుతోపాటు విద్యా సామగ్రిని అందచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ఎస్. ముత్యంగౌడ్, టీ రమణయ్య గౌడ్, టీ సుబ్బారావు, డీ హరిగౌడ్, తాళ్లరాజా, ఏ రవి, దాసరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 9 : ఆర్టీసీ నెల్లూరు-1వ డిపో పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆదివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో, ప్రయాణికులు 9959225641 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలుపాలన్నారు.

చవితి పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని మాగుంట లేఅవుట్ బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్‌కు లంబోదర సెంటర్‌గా శుక్రవారం నామకరణ చేశారు. అనంతరం చవితి గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీ మధుసూదన్‌రెడ్డి, ఎస్. మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన కల్యాణ్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఆగస్టు 9 : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను నెల్లూరు రూరల్ టీడీపీ నాయకుడు వేలూరు కల్యాణ్ రెడ్డి శుక్రవారం మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ యువతకు మంచి అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు.

మొండి బకాయిదారులను గుర్తించండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 9 : నెల్లూరు కార్పొరేషన్‌కు ఆస్తి పన్ను చెల్లించకుండా ఉన్న మొండి బకాయిదారుల జాబితాను సిద్ధం చేయాలని నగర కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్‌లో రెవెన్యూ విభాగంపై ఆయన సమీక్ష జరిపారు. మొండి బకాయిదారుల నుంచి పన్నులు రాబట్టాలన్నారు. ఆర్ఐ, ఆర్వోలు వారికి కేటాయించిన పన్నులు నిర్దేశిత కాల వ్యవధిలోపు వసూలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీ చెన్నుడు పాల్గొన్నారు.

గిరిజనుల్లో మార్పు రావాలి

● జిల్లా న్యాయాధికారి డాక్టర్ యామిని

నెల్లూరురూరల్: పరుగులు తీస్తున్న ప్రపంచంతోపాటు గిరిజనుల్లోనూ మార్పు రావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయాధికారి డాక్టర్ సీ యామిని అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భాగంగా మండలంలోని ములుముడిలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ గిరిజనులకు ఏ అవసరమున్నా అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐదవ అదనపు న్యాయాధికారి సరస్వతి, న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కే వాణి, తహసీల్దారు లాజరస్, సీఐ మారుతీకృష్ణ, జిల్లా సర్వైలెన్స్ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల పోస్టర్ విడుదల

నెల్లూరు,(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 9 : సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆవిష్కరించారు. పుట్టినరోజు వేడుకల్లో భాగంగా వారం రోజులు చేసే సేవా కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు మార్కెట్ సురేష్, రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు రవికుమార్, కారంపూడి కృష్ణారెడ్డి, రామ్‌చరణ్ యువత జిల్లా అధ్యక్షుడు మేకల ప్రసాద్ యాదవ్, నగర అధ్యక్షుడు గుర్రం కిషోర్, వరుణ్‌తేజ్ యువత జిల్లా అధ్యక్షుడు చిన్న తదితరులు పాల్గొన్నారు.

అల్లీపురం రహదారి పునఃప్రారంభం

నెల్లూరు రూరల్: జాతీయ రహదారి నుంచి అల్లీపురం వైపు వెళ్లు రహదారి శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. జాతీయ రహదారి ఎన్టీఆర్ నగర్ వే బ్రిడ్జి వద్ద కల్వర్టు నిర్మాణంతో పాటు సీసీ రోడ్లు నిర్మిస్తున్న నేపథ్యంలో వాహన రాకపోకలు నిలిపివేశారు. దీంతో పుల్లమ్మ సత్రం దారిని ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జోక్యం చేసుకుని రహదారికి మరమ్మతులు, కల్వర్టు నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో తాజాగా రహదారి పునఃప్రారంభమైంది. ఈ మార్గాన్ని సోమిరెడ్డి నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.

వేదగిరిపై 'శ్రావణ' పూజలు

నెల్లూరు రూరల్: శ్రావణ శుక్రవారం సందర్భంగా వేదగిరి క్షేత్రంలో ఆదిలక్ష్మి అమ్మవారికి పూజలు జరిగాయి. అలాగే, గరుడ పంచమి సందర్భం గా గరుత్మంతుడికి పూజలు చేశారు. చిన్న గరుడ వాహనంపై గిరిప్రదక్షణ చేపట్టారు. ఇన్‌చార్జి ఈవో సుధీర్, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



చిట్టేడులో పురాతన శాసనం

కోట మండలం చిట్టేడు గ్రామంలోని చిట్టేటమ్మ ఆలయానికి సంబంధించిన 15వ శతాబ్దంనాటి శాసనం వెలుగు చూసింది.గ్రామస్తుల ఆహ్వానం మేరకు గూడూరు ఎస్‌కేఆర్ కళాశాల చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ గోవిందు సురేంద్ర, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సీనియర్ ఫెలోషిప్ డాక్టర్ మమత ఈ శాసనాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోవిందు సురేంద్ర మాట్లాడుతూ.. 15వ శతాబ్దానికి చెందిన చిట్టేడు గ్రామ పాలేదారుల వంశానికి చెందిన లింగమ నాయుడు కుమారుడు కృష్ణప్ప నాయుడి పెద్ద సోదరి లక్ష్మమ్మ వేయించిన శాసనంగా గుర్తించారు.దీనిపై చిట్టేటమ్మ ఆలయ నిర్మాణం, కోనేరు, మండపానికి సంబంధించిన విషయాలున్నాయన్నారు. ఈ శాసనం సంస్కృత భాష, ప్రాచీన తెలుగులిపిలో మొత్తం 16 పంక్తులతో శంఖుచక్ర, సూర్యచంద్ర నామాల గుర్తులతో ఉందన్నారు.

- కోట

తిరుమలలో గరుడసేవ



తిరుమల క్షేత్రంలో శుక్రవారం రాత్రి గరుడవాహన సేవ కన్నులపండువగా జరిగింది. గరుడపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడిడిపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు నాలుగు మాడవీధుల్లో శ్రీవారు ఊరేగారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి



రావి,వేప చెట్లకు కల్యాణోత్సవం

ఎర్రావారిపాలెం మండలం కమ్మళ్ళ కూడలి సమీపంలోని రావి , వేప వృక్షాలకు శుక్రవారం ఉదయం కల్యాణం జరిపించారు.కమళ్ళయ్యగారిపల్లెకు చెందిన వాసు చాలా సంవత్సరాలుగా గ్రామస్తులతో కలిసి రావి, వేప చెట్లకు పెండ్లి జరిపిస్తున్నారు. ఈ క్రమంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం ఉదయం పురుషోత్తం, అరుణ దంపతులు వరుడి కుటుంబం(రావి) తరఫున, జయరామయ్య, గీత దంపతులు వధువు (వేప)కుటుంబం తరఫున పట్టు వస్త్రాలు ధరించి పెండ్లి పీటలపై ఆశీనులయ్యారు.వేదపండితులు సాయి వర్మ కళ్యాణ తంతు నిర్వహించారు.అనంతరం గ్రామస్తులకు విందు భోజనం వడ్డించారు.

- ఎర్రావారిపాలెం

నిమ్మ ధర అదిరింది



గూడూరు మార్కెట్‌లో నిమ్మకాయల ధరలు ఊపందుకున్నాయి. కొద్ది రోజులుగా ధరలు పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం కిలో నిమ్మకాయలు అత్యధికంగా రూ.140పలికాయి. టిక్కీ బస్తా(50 కిలోలు) ధర రూ.7 వేలు,పండ్లు, పొడికాయలు సైతం టిక్కీ బస్తా ధర రూ.3 వేలు పలకడంతో రైతు, వ్యాపార వర్గాల్లో సంతోషం వ్యక్తమైంది.కాయలు మార్కెట్‌కు తక్కువగా రావడం, శ్రావణ మాసం నడుస్తుండడంతో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో డిమాండ్ పెరగడంతో నిమ్మధరలకు ఊపొచ్చినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

- గూడూరు అర్బన్

డాక్టర్ సీఆర్‌రెడ్డి జీవిత ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యానాయుడు, ఎమ్మెల్యే సునీల్‌కుమార్,డాక్టర్ సీఎంకే రెడ్డి తదితరులు →



సంపదను పంచడంలోనే ఆనందం

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

గూడూరు, ఆగస్టు 9 : మన సంపాదనలో కొంతభాగాన్ని సమాజానికి పంచడంలోనే నిజమైన ఆనందం వుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శుక్రవారం గూడూరు డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు అల్లారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి,డాక్టర్ సీఆర్‌రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు.అనంతరం డాక్టర్ సీఆర్‌రెడ్డి జీవిత ప్రస్థానం పుస్తకాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ గూడూరులో మహిళలు విద్యలో రాణించేందుకు స్నేహితులైన శ్యామ్‌సుందర్ రెడ్డి, సీఆర్‌రెడ్డి 1980వ సంవత్సరంలో దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలను స్థాపించి ఉన్నతస్థాయికి తీసుకురావడం సంతోషదాయకమన్నారు.ఈ కళాశాల వేలాదిమంది మహిళల జీవితాలకు ఉన్నత బాట చూపిందన్నారు.ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నతచదువుతోనే ఉజ్వల భవిష్యత్తుంటుందన్నారు. శ్యామ్‌సుందర్‌రెడ్డి, డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆశయాలను కళాశాల యాజమాన్యం ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు.అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి, డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్దన రెడ్డి, డాక్టర్ మెహర్‌మణి, హనుమంతరావు, బి.సురేంద్రరెడ్డి, సుధీర్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, రమణబాబు, ముని గిరీష్ పాల్గొన్నారు.

19న శ్రీసిటీకి సీఎం?

సత్యవేడు, ఆగస్టు 9: సీఎం చంద్రబాబు ఈ నెల 19న శ్రీసిటీ పర్యటనకు విచ్చేయనున్నట్లు సమాచారం. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఇటీవల సీఎంను కలిసి ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఎండీ, ఇతర అధికార ప్రతినిధులతో కలిసి చంద్రబాబు పర్యటించనున్న డైకిన్ పరిశ్రమను పరిశీలించారు.

పలువురు సీఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 9: పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ షామోషి ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి క్రైం సీఐ కళా వెంకటరమణను ట్రాఫిక్‌కు, కర్నూలు వీఆర్‌లో వున్న డి. గోపిని శ్రీకాళహస్తి వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. శ్రీకాళహస్తి వన్‌టౌన్‌లో వున్న ఎస్‌వీ నరసింహారావును తిరుపతి వీఆర్‌కు పంపారు. కమాండ్ కంట్రోలులో పనిచేస్తున్న టీవీ శ్రీనివాసులును శ్రీసిటీకి, సీఐడీలో పనిచేస్తున్న కిషోర్‌బాబును గూడూరు రూరల్‌కు, వెంకటగిరిలో పనిచేస్తున్న సంగమేశ్వరరావును నాయుడుపేట రూరల్‌కు, ప్రకాశం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న ఎ.వెంకట్రమణను వెంకటగిరికి బదిలీ చేశారు.రేణిగుంట, గాజులమండ్యం సీఐలు మల్లికార్జున్, సుబ్బరాయుడులను వీఆర్‌కు పంపారు. తిరుపతి మహిళా పీఎస్‌లో వున్న శరత్‌చంద్రను రేణిగుంటకు,తిరుపతి సీసీఎస్‌లో వున్న మురళీకృష్ణను గాజులమండ్యం స్టేషన్‌కు, కల్యాణీడ్యాం పీటీసీలో వున్న ఎం.మురళీని సత్యవేడుకు బదిలీ చేశారు.

పంద్రాగస్టున మంత్రి ఆనం పతాకావిష్కరణ

తిరుపతి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగే జిల్లాస్థాయి వేడుకల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎవరికీ మంత్రి పదవులు దక్కని సంగతి తెలిసిందే. దీంతో స్వాతంత్ర్య దిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఎవరు హాజరవుతారన్న దానిపై సందిగ్ధం నెలకొంది. దీనికి తెరదించుతూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం జిల్లాల వారీగా స్వాతంత్ర్య దిన వేడుకల్లో పాల్గొనే మంత్రుల జాబితాను ప్రకటించింది.మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తిరుపతిలో జరిగే వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

నాయుడుపేట డీఎస్పీగా చెంచుబాబు



నాయుడుపేట టౌన్, ఆగస్టు 9 : నాయుడుపేట డీఎస్పీగా చెంచుబాబు బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తూ బదిలీపై నాయుడుపేటకు వచ్చారు. ఆమేరకు శుక్రవారం ఉదయం డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నాయుడుపేట డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు పుష్పగుచ్ఛాలు అందజేసి డీఎస్పీకి అభినందనలు తెలియజేశారు.

సీఐగా మురళీకృష్ణ బాధ్యతల స్వీకారం



సూళ్లూరుపేట, ఆగస్టు 9: సూళ్లూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ టీంలో పనిచేస్తూ సూళ్లూరుపేట సీఐగా మురళీకృష్ణ బదిలీ అయ్యారు. ఆమేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించగా తడ, సూళ్లూరుపేట ఎస్‌ఐలు నరసింహారావు, రహీంరెడ్డి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అలాగే ఇక్కడ సీఐగా పనిచేస్తున్న మధుబాబును ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. ఆయన శుక్రవారం రిలీవ్ అయ్యారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

తడ/సూళ్లూరుపేట, ఆగస్టు 9: నేడు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ ఖాదర్‌బాషా, ఏఈ మురళి పేర్కొన్నారు. ఆయా సబ్ స్టేషన్లలో సాధారణ మరమ్మతులు చేపడతున్న కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నైపుణ్యాలను పెంపొందించుకోండి



ఓరియంటేషన్ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు

గూడూరు, ఆగస్టు 9: ఉన్నతస్థాయికి ఎదగడానికి విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ అన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా బీటెక్‌లో చేరిన విద్యార్థులకు ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో కష్టపడి చదువుకుంటేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవరుచుకోవాలన్నారు. లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదివి వాటిని సాధించి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో దశరథరామయ్య, డాక్టర్ రవిప్రసాద్, విష్వక్సేనారెడ్డి, నీరజ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ సేవలు అభినందనీయం


గర్భిణులకు ఆహారం అందిస్తున్న వెంకటేశ్వర్లు

గూడూరు అర్బన్, ఆగస్టు 9: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేయడమే కాకుండా, సైన్స్‌పట్ల అవగాహన కల్పిస్తూ, చేడు అలవాట్లకు బానిసలు కాకుండా కార్యక్రమాలను నిర్వహిస్తుండడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, డాక్టర్ షరీనా, వి. రాజేంద్ర ప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, రామ్మోహన్, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్‌ను వినియోగించుకోండి

- బకాయిదారులకు యూనియన్ బ్యాంకు సూచన

పెళ్లకూరు ఆగస్టు 9: రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న వారికి యూనియన్ బ్యాంకు అమలు చేస్తున్న వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను వినియోగించుకోవాలని బ్యాంకు మేనేజర్ వి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చెంబేడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రుణాలు తీసుకుని రెండు, మూడేళ్లగా రుణాలు తిరిగి చెల్లించలేని బకాయిదారులు రుణ విముక్తి నుంచి ఉపశమనం పొందేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు, నాయుడుపేట యూనియన్ బ్యాంకు మేనేజర్లు రాజశేఖర్, జీవీ మహిధర్, ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి


కేక్‌కట్ చేస్తున్న పీఆర్ క్లబ్ సభ్యుడు గోపాల్‌రెడ్డి

గూడూరు, ఆగస్టు 9: తమకున్నంతలో పేదలకు సేవ చేయడం ద్వారానే సంతృప్తిని పొందుతామని పీఆర్ క్లబ్, రోటరీ క్లబ్ సీనియర్ సభ్యుడు ఎ.గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పీఆర్ క్లబ్‌లో క్లబ్ సీనియర్ సభ్యుడు గోపాల్‌రెడ్డి 75వ పుట్టినరోజు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా పార్టీలకతీతంగా అందరికీ సాయం చేశానన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సిద్దారెడ్డి, కె.మీరారెడ్డి, మధురెడ్డి, మస్తాన్‌నాయుడు, ఉమాశంకర్, చెంచురామయ్య, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్‌డీగా పదోన్నతి

వాకాడు, ఆగస్టు 9 : మండలంలోని వాకాడు పంచాయతీ ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వర రావుకు వెంకటగిరి నియోజక వర్గంలోని కమ్మవారిపేట ఈవోపీఆర్‌డీగా పదోన్నతి వచ్చింది. ఈ సందర్భంగా సహచర సిబ్బంది ఉమామహేశ్వర రావుకు అభినందించారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుకలు



వాకాడు, ఆగస్టు 9: మండలంలోని అశోక్ పిల్లర్ ప్రాంగణంలో సూపర్‌స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి, బాణసంచా కాల్చి కేక్‌ను కట్‌చేసి పంచి పెట్టారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకున్న శ్రీమంతుడని మహేష్‌బాబును కొనియాడారు. ఈ కార్యక్రమంలో చంద్ర, డ్యానీ, ఉదయ్, మున్నా, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన అధ్యక్షుడికి పరామర్శ

వాకాడు, ఆగస్టు 9: వైసీపీ నాయకుల దాడిలో గాయపడి వాకాడు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనసేన మండల అధ్యక్షుడ శివకోటిని శుక్రవారం ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు, లీగల్‌సెల్ కార్యదర్శి టి.చంద్రశేఖర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ... పొదుపు సంఘాల్లో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు గురువారం జరిగిన పాఠశాల విద్యాకమిటీ ఎన్నికల్లో అభ్యర్థులు ఏకగ్రీవం కావడానికి శివకుమార్ ప్రధానపాత్ర పోషించారన్నారు. దీంతో వైసీపీ నాయకులు శివకోటిపై దాడి చేశారన్నారు. దాడి చేసిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలని కోరారు. మోహన్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, ఆగస్టు 9: పట్టణంలోని అన్న క్యాంటీన్ ఎదురుగా ఉన్న డాక్టర్ శశీస్ దంత వైద్య ఆసుపత్రిలో ఆదివారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. నెల్లూరు సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పెన్షనర్స్, ఈహెచ్‌ఎస్ హెల్త్‌కార్డు ద్వారా కంట్లో శుక్లం ఆపరేషన్ ఉచితంగా చేస్తారన్నారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ కార్డుదారులకు పరీక్షలు నిర్వహించడమే కాకుండా శస్త్రచికిత్సలు చేపడుతామని చెప్పారు

కొత్త పరిశ్రమల కోసం భూముల గుర్తింపు

- పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్

నాయుడుపేట టౌన్, ఆగస్టు 9 : కొత్త పరిశ్రమల కోసం సెజ్‌లలో మిగిలి ఉన్న భూములను గుర్తిస్తున్నట్లు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తెలిపారు. మేనకూరు సెజ్‌లో శుక్రవారం సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలసి భూములను పరిశీలించారు. మొదటగా ఏపీఐఐసీ కార్యాలయానికి చేరుకుని ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. కొత్తగా పరిశ్రమలు వస్తే కేటాయించడానికి ఎంత భూమి సిద్ధంగా ఉంది... ఆ భూముల స్థితిగతులపై ఆరాతీశారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న భూములపై అధికారులతో చర్చించారు. గతంలో సెజ్‌లో నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన నిర్మాణ పనులు ఆగిపోవడంతో వాటిపై కూడా సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట తహసీల్దారు గీతావాణి, ఏపీఐఐసీ అధికారులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.


భూములను పరిశీలిస్తున్న యువరాజ్, కలెక్టర్ వెంకటేశ్వర్

షార్ సాయంతో చురుగ్గా డ్రెయిన్ల నిర్మాణాలు



వైజంక్షన్ వద్ద పూడికతీత పనులు - షార్ బస్టాండు వద్ద నిర్మిస్తున్న కాలువ

సూళ్లూరుపేట, ఆగస్టు 9: పట్టణంలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించేందుకు షార్ అధికారులు చొరవ తీసుకొన్నారు. షార్ కేంద్రానికి సూళ్లూరుపేట మీదుగా వెళ్లాల్సి ఉంది. పట్టణంలో రైల్వే గేటు అవతలి వైపు షార్ బస్టాండు నుంచి షార్ వైజంక్షన్ వరకు ఎక్కడ చూసినా రోడ్లపై మురుగు ప్రవహిస్తూ ఉంటోంది. పందుల సంచారమూ ఎక్కువే. దీంతో షార్ యాజమాన్యం స్పందించింది. డ్రెయిన్లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీయే చెపట్టాల్సి ఉన్నా ఈ ప్రతిష్ఠాత్మక సంస్థ ముందుకొచ్చింది. షార్ బస్టాండు నుంచి వైజంక్షన్ వరకు రెండు వైపులా రూ.18 లక్షలతో కాలువలు నిర్మిస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో రోడ్డుపై మురుగు నిల్వ చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. షార్ వైజంక్షన్ నుంచి కూడా మురుగు కాలువల్లో చెత్త, మట్టిని ఎక్స్‌కవేటర్ల సాయంతో బయటకు తీస్తున్నారు. చిన్నపాటి వర్షమొచ్చినా పభుత్వ డిగ్రీ కళాశాల వరకు రోడ్డుపై నీరు నిలబడిపోతోంది. దీంతో అవస్థలు తప్పడం లేదు. పనులు చేపట్టడంపై స్థానికులు హర్షం చేస్తున్నారు.

రహదారి పక్కన చెత్త వేస్తే కఠిన చర్యలు



వాహనానికి పెనాల్టీ విధిస్తున్న ఎంపీడీవో - సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న కార్మికులు

తడ, ఆగస్టు 9: జాతీయ రహదారి పక్కన చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో విజయకుమార్ హెచ్చరించారు. తడలో పలు సంస్థలు, పరిశ్రమలు తమ సంస్థల వ్యర్థాలను జాతీయ రహదారి వెంబడి పారబోస్తుండడంపై పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో నిఘా పెట్టిన పంచాయతీ అధికారులు గురు, శుక్రవారాల్లో పలు వాహనాల నుంచి రూ.15 వేలు జరిమానా వసూలు చేశారు. మరోసారి చెత్తవేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... తడ పట్టణ పరిధిలో రోడ్ల పక్కన ఇష్టానుసారంగా చెత్తను తీసుకువచ్చి పార వేస్తున్నారన్నారు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా తడ కండ్రిగ శివాలయం వద్ద కరిపేటి కాలువకు ఆనుకొని వ్యర్థాలను పారబోస్తున్నారని అవి కాస్తా కాలువలో కలిసి కలుషితమవుతోందన్నారు. ఇక్కడే కాకుండా అక్కంపేట, కొండూరు, పూడి వద్ద వ్యర్థాలను పారబోస్తుండడాన్ని గుర్తించామన్నారు. అందుకే ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ఇకనుంచి చెత్త వేస్తే ఆ వాహనాలపై కేసులు నమోదు చేయించి భారీగా జరిమానా విధిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి గాబ్రియేల్, శశికుమార్ పాల్గొన్నారు.

జోరుగా పూడికతీత పనులు



వెంకటగిరి టౌన్, ఆగస్టు 9: పట్టణంలోని పోలేరమ్మ ఆర్చి సెంటర్ నుంచి కైవల్యా నది వరకు మున్సిపాలిటీ అధికారులు శుక్రవారం మురుగునీటి కాలువల్లో పూడికతీత చేపట్టారు. పనిలో పనిగా కాలువపై అక్రమ నిర్మాణాలను తొలగించారు. గత పది రోజులుగా అన్ని ప్రాంతాల్లోని మురుగునీటి కాలువల్లో పూడికతీత కార్యక్రమం చేపట్టారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మున్సిపాలిటీలోఅభివృద్ధి పనులు చేపట్టడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో దోమలు బెడద ఎక్కువగా ఉందని అధికారులు ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కార్పొరేట్ కంపెనీల దోపిడీని అరికట్టండి




వెంకటగిరి ఎంపీడీవో కార్యాలయం ముందు, గూడూరు పోస్టాఫీసు వద్ద నాయకుల నిరసన

వెంకటగిరి టౌన్, ఆగస్టు 9: దేశంలో కార్పొరేట్ కంపెల దోపిడీని అరికట్టాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వి.వి.రమణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం క్విట్ ఇండియా డే సందర్భంగా క్విట్ కార్పొరేట్ పేరుతో దేశవ్యాప్త నిరసనలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు, కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రధానమంత్రి మోదీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలేనని విమర్శించారు. అదానీ, అంబానీలు మోదీని ఉపయోగించుకుని పదేళ్లల్లో ప్రపంచ కుబేరుల జాబితాలో చేరారన్నారు. మోదీ అధికారంలోకి వచ్చే నాటికి రూ.66లక్షల కోట్లు విదేశీ అప్పు ఉండగా నేడు అది రూ.188లక్షల కోట్లకు చేరిందన్నారు. ఏటా రెండు కోట్ల ఉగ్యోగాలు కల్పిస్తామన్న హామీని గాలికి వదిలేయడంతో నిరుగ్యోగ సమస్య తీవ్రమవుతోందన్నారు. అడవులను, సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు వీలుగా అటవీ సంరక్షణ చట్టాన్ని సవరించారని దుయ్యాబట్టారు. వ్యవసాయ యంత్ర పరికరాలపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకుడు పి.బాలకృష్ణయ్య, సీఐటీయూ నాయకులు చెంగయ్య, శివకుమార్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక పోస్టాఫీసు వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ డే నిర్వహించారు. రైతులకు గిట్టుబాటు ధర, రుణమాఫీ, పంటల బీమా, రైతులకు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌రంగ ప్రైవేటీకరణను, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను నిలుపుదల చేయాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో శివకుమార్, కె.వెంకటేశ్వర్లు, వెంకట్రామిరెడ్డి, బీవీరమణయ్య, సురేష్, డేవిడ్, మాధవయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి శ్రీకారం: ఆదిమూలం


పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే

సత్యవేడు, ఆగస్టు 9: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్యనం దించేందుకు ప్రభుత్వం విద్యాభివృద్ధికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జగన్మోహనాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా రాత, పాఠ్య పుస్తకాలు అందిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇంటర్ విద్య నిచ్చెన లాంటిదన్నారు. ఇక్కడ ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని ఆదిశగా పయనిస్తే ప్రతి ఒక విద్యార్థి విజయశిఖరాలకు చేరుకోవచ్చన్నారు. విలువైన సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి తల్లితండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో రవి, ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ రవిచంద్ర బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, నాయకులు రోశయ్య, సుబ్రహ్మణ్యం రాజు, చిన్న, బాలమురళి, అమాసరెడ్డి, సంతోష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్స్‌కు నగదు ప్రోత్సాహకం

సత్యవేడు, ఆగస్టు 9: సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గత ఏడాది టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో పాఠశాల టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా నగదు బహుమతులను అందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు గణేష్‌కు రూ.10 వేలు, శిరీషకు రూ. 6వేలు, దీపికకు రూ.నాలుగు వేలును దాతలు చ్కొలింగం, రమేష్‌రాజు, ప్రవీణ్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు శ్రీసిటీ పీఆర్వో రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అధ్యాపకుల వినతి

సత్యవేడు, ఆగస్టు 9: సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ఆదిమూలానికి వినతిపత్రం అందించారు. శుక్రవారం కళాశాలలో జరిగిన స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు తమ సమస్యలను విన్నవించారు. గత వైసీపీ ప్రభుత్వం తమను రెగ్యులర్ చేస్తామని చెప్పి, జీవో తీసుకొచ్చి అమలు చేయకుండా నిలువునా ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో తమతోపాటు నియమించిన ఒప్పంద అధ్యాపకులను అక్కడి ప్రభుత్వం రెగ్యులర్ చేసిందని, తమను మాత్రం ఇంకా రెగ్యులర్ చేయలేదన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుధీర్, శివరామ్, సలీం, దస్తగిరి, కృష్ణవేణి, గీత తదితరులు పాల్గొన్నారు.

దేశంలో కార్పొరేట్లను తరిమికొడదాం: సీపీఎం

సత్యవేడు, ఆగస్టు 9: క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశంలో వ్యవసాయ, కార్మిక రంగాలపై ఆధిపత్యం చెలాయిస్తున్న కార్పొరేట్ పెత్తందారులను తరిమికొడదామని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను నిరసిస్తూ భారత్ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ కార్మికసంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కేరళ తరహాలో రాష్ట్రంలో రైతులకు రుణ విమోచన చట్టం తీసుకురావాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం డీటీ రవిచంద్రబాబుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వ్యకాసం నాయకులు మునస్వామి, కృష్ణయ్య, సెల్వం, మురళి తదితరులు పాల్గొన్నారు.

అంకాళ పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



కోట, ఆగస్టు 9: మండలంలోని అల్లారెడ్డి శ్యామసుందరపురంలో అంకాళ పరమేశ్వరి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారం చేపట్టారు. నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. గణపతి పూజ, యంత్ర, జప, అనుష్కములు, అంకురార్పణ, వాస్తుమండపం, యోగి మండపం, నవగ్రహ మండప ఆరాధనలు, అగ్ని ప్రతిష్ఠ, లక్ష్మీగణపతి హోమం జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు




నాయుడుపేట టౌన్, ఆగస్టు 9: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద కొలువై ఉన్న గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో మొదటి శ్రావణ శుక్రవారాన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని 85 చీరలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మొదటి శ్రావణ శుక్రవారం కావడంతో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పట్టణంలోని దుర్గాదేవి, అంకమ్మ, మానసాదేవి, కన్యకా పరమేశ్వరి ఆలయాలలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుందరమ్మకు విశేషపూజలు



చిల్లకూరు, ఆగస్టు 9: పట్టణంలోని దళితవాడలో కొలువై ఉన్న సుందరమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం విశేషపూజలు జరిగాయి. శుక్రవారం, శనివారం, ఆదివారం మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్లలో భాగంగా మొదటిరోజు అమ్మవారికి విశేషపూజలు, కలశ స్థాపన, త్రిశూల ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈశ్వర దేవస్థానానికి భూమిపూజ



నాయుడుపేట, ఆగస్టు 9: మండలంలోని పుదూరు సమీపంలో ప్రణవ బ్రహ్మసూత్ర ఈశ్వర దేవస్థానానికి భూమిపూజ నిర్వహించారు. శుక్రవారం జరిగిన భూమిపూజ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు పాల్గొన్నారు. అలాగే దేవప్రయోగ పీఠాధిపతి చిదానంద మహారాజ్ కూడా పాల్గొన్నారు.

12నుంచి సర్పంచులకు శిక్షణ

బాలాయపల్లి, ఆగస్టు 9: పంచాయతీలకు వచ్చే నిధులపై సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో అరుణ అవగాహన కల్పించనున్నారు. ఈనెల 12న సోమవారం నుంచి 14 తేది వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం


భూమిపూజలో నెలవల తదితరులు

నాయుడుపేట, ఆగస్టు 9: రోటరీక్లబ్ సేవలు అభినందనీయమని సూళ్లూరుపేట నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. సీడీసీ మాజీ చైర్మన్ కె.సుధాకర్ రెడ్డి తన తండ్రి రామచంద్రా రెడ్డి జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పార్కు సమీపంలో రూ.15 లక్షలతో బష్‌షెల్టర్‌ను నిర్మిస్తున్నారు. శుక్రవారం ఉదయం జరిగిన భూమిపూజలో నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరికి, మేనకూరులోని పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, ప్రయాణికులకు సౌకర్యంగా బష్‌షెల్టర్ నిర్మించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు గోపీనాథ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను మర్యాదపూర్వకంగా కలిసిన వేలూరు



పెళ్లకూరు ఆగస్టు 9 : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావును టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీ కృష్ణారెడ్డి అమరావతిలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పేదలకు సంక్షేమ పథకాలు అందేలా, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వారు సూచించినట్లు మురళీకృష్ణారెడ్డి తెలిపారు. ఈయనతో పాటు టీడీపీ నాయకుడు ఎస్.సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కల్యాణ్



పెళ్లకూరు ఆగస్టు 9: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్‌ను మండలంలోని శిరసనంబేడుకు చెందిన టీడీపీ యువనేత, కేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వి.కల్యాణ్‌రెడ్డి అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన ట్రస్ట్ ద్వారా సూళ్లూరుపేట, నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ట్రస్ట్ సేవలను విస్తృతంగా చేపట్టి పేదలకు అండగా నిలవాలని మంత్రి తనకు సూచించినట్టు కల్యాణ్‌రెడ్డి తెలిపారు.